MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 23 సంచిక: 4 రంగారెడ్డి డిసెంబర్ 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## స్వయంసహాయ సమాఖ్యల జయకేతనం !



'ఉత్తమ స్వయంసహాయ సమాఖ్య'లకు ఏపిమాస్ జాతీయ పురస్కారాలు:అవార్డులతో పురస్కార గ్రహీతలు

## విశ్వ 'సహకార' సహభావన !





ఢిల్లీలో 'ప్రపంచ సహకార సదస్సు'ను ప్రారంభించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ...
... సదస్సులో పాల్గొన్న శ్రీ సి ఎస్ రెడ్డి






సమాఖ్యల జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న సెర్ప్ తెలంగాణా సి ఇ ఓ దివ్యా దేవరాజన్ ... సభలో పాల్గొన్న కొందరు

NABARD

నాబార్డ్ సౌజన్యంతో ....


మీకు తెలుసా ?

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - మొత్తంగా పంట దిగుబదులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ... ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

## మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

## వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత


సంపుటి 23 సంచిక 4



సంపాదకీయం

## అభినందనలు !

ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలకు ఏపిమాస్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి పురస్కార ప్రదానోత్సవం ఉత్సాహంగా జరిగింది. విజేతలైన స్వయంసహాయ సమాఖ్యల నాయకత్వాలకు మన:పూర్వక అభినందనలు. వరుసగా నాలుగవ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా వుంది. జరిగినవి కేవలం రెండు రోజుల సదస్సులే అయినా, దీనికి పూర్వరంగంలో వివిధ స్థాయిలలో, ఎందరెందరో కొన్ని నెలలపాటు సాగించిన కృషి వుంది. పాలకవర్గం మార్గదర్శనం, దాతృత్వ సంస్థల సహకారం, వచ్చిన దరఖాస్తులలో నిర్దిష్ట ప్రామాణికాల ప్రాతిపదికగా ఉత్తమమైనవాటిని నిగ్గుతేల్చిన న్యాయనిర్ణేతల కృషి, రెండు రోజుల సదస్సులకు సర్వసన్నద్ధంచేసిన ఏపిమాస్ సిబ్బంది తోడ్పాటు ... యిలా పలువురి సహభాగస్వామ్య సహకారం ఈ బృహత్ కార్యక్రమం విజయవంతం కావడానికి మూలం. తోడ్పాటు అందించిన అన్ని సంస్థలకు, వ్యక్తులకు నమస్సుమాలు. మనదేశంలో స్వయంసహాయ ఉద్యమం తొలి నాళ్ళ నుంచి ఉద్యమ అగ్రశ్రేణిలో నిలిచిన తెలుగు రాష్ట్రాల సమాఖ్యలు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలవడం సహజమే. ఈ విజయాల వెనుక ఎంతో కొంత ఏపిమాస్ పాత్ర వుందన్న వాస్తవం ఆనందాన్నిస్తుంది. అయితే, ఏవో ఒకటి రెండు సమాఖ్యలు కాదు, అత్యుత్తమ నిర్వహణతో ఒకదానికొకటి పోటాపోటీగా అవార్డులవేట సాగించి, న్యాయనిర్ణేతలను కూడా సంకటంలో పడవేసేంతగా ప్రగతి సాధిస్తే అది మరింత ఆనందదాయకం. తెలుగు రాష్ట్రాల సంగతి అటుంచితే, ఇతర రాష్ట్రాల సమాఖ్యల పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. ప్రాంతీయ స్థాయిలో రెండవ బహుమతికి అర్హత కలిగిన సమాఖ్యలుకూడా దరఖాస్తులలో లేకపోవడం బాధాకరం. ఈ పరిణామాలన్నీ స్వయంసహాయ ఉద్యమం యింకా ఆశించిన పరిణతిని సాధించలేదని, అభివృద్ధి పథంలో వేయవలసిన అడుగులు యింకా ఎన్నో మిగిలి వున్నాయన్న వాస్తచిత్రాన్ని కళ్ళకు కట్టిస్తున్నాయి. పురస్కారాల ప్రోత్సాహంతోనైనా స్వయంసహాయ ఉద్యమానికి తిరిగి పూర్వవైభవం సంతరించడానికి ఏపిమాస్ సాగిస్తున్న బృహత్ ప్రయత్నం యికపైకూడా కొనసాగించవలసివుంటుందన్న సంకేతాన్ని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. అయితే, అశించిన ఫలితాలు సాధించేవరకు తాను చేపట్టిన కార్యక్రమాలను విరమించే స్వభావం ఏపిమాస్‌ది కాదు కాబట్టి ఈ దిశగా కృషి కొనసాగింపునకు ఏపిమాస్ ఎప్పుడూ సంసిద్ధంగా వుంటుంది. ఈ సదస్సులు, వివిధ రాష్ట్రాలలో సమాఖ్యలు చేపడుతున్న కొన్ని ఫలప్రదమైన జీవనోపాధుల కార్యక్రమాలను, ఆచరణీయ విశిష్ట విధానాలను, విజయగాథలను వెలుగులోకి తెచ్చాయి. వీటితోపాటు సమాఖ్యలకు ఎదురవుతున్న కొన్ని అడ్డంకులను, విలక్షణమైన పరిస్థితులను, కొన్ని వైఫల్యాలను కూడా కళ్ళముందుంచి,సమాఖ్యల నిర్వహణలోని లోతుపాతులపైన మరింత వాస్తవిక అవగాహనకు దోహదం చేశాయి. ఏపిమాస్ గత నాలుగేళ్ళుగా ఈ పురస్కార మహోత్సవాలు నిర్వహిస్తున్నది యిందుకోసమే. విజయోత్సవాలు నిజానికి విజేతలను ప్రశంసించడానికి కాదు. ప్రశంసించినా, లేకున్నా వారు అప్పటికే విజేతలు. గెలుపుబాటలో వెనుకబడినవారు వివిధ స్థితిగతులపట్ల మరింత అవగాహన పెంపొందించుకుని, తామూ విజయపథంలో పయనించడానికి, అగ్రశ్రేణిలో నిలవడానికి ఈ ఉత్సవాలు దోహదం చేయాలని, చేస్తాయని ఆశించడమే యిందుకు కారణం. వచ్చే 2025 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ఐక్యరాజ్యసమితి ప్రటించింది. అందువల్ల సహకార, అభివృద్ధి రంగాలలో అటు ప్రభుత్వపరంగా, యిటు ప్రభుత్వేతరంగా అనేకానేక కార్యక్రమాలు స్వయంసహాయ వ్యవస్థను బలోపేతంచేసే దిశగా అమలు జరుగుతాయి. ఏపిమాస్ కూడా అంతర్జాతీయ సహకార సంవత్సరానికి సన్నద్ధమై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని, స్వయంసహాయ సమాఖ్యలు, ఎఫ్ పి ఓలు మరిన్ని ముందడుగులు వేస్తాయని అశిద్దాం.



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

ఎవరు ఏమి కీడు చేసినా నీ మేలు కోరుకునే ఒక మంచి స్నేహితుడు వుంటే చాలు

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

**ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి, ఎస్. ప్రహ్లాదయ్య**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి , సాంకేతిక సహకారం: బి మౌళి**


## లోపలి పేజీలలో ....


- ఏపిమాస్ ఆధ్వర్యంలో స్వయంసహాయ విజయోత్సవం 05
- స్వయం సహాయ సమాఖ్యలు : పురస్కారాలు 08
- సేంద్రియ వ్యవసాయానికి బాసటగా బయోచార్ 09
- రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ క్షేత్ర సందర్శన 10
- సేంద్రియ మిరపపంట క్షేత్ర దినోత్సవం 12
- అంతర్జాతీయ సహకార సంవత్సరానికి శ్రీకారం 13
- వయసునుబట్టి పోషకాహారాలలో మార్పు 14
- ప్లాస్టిక్ డ్రమ్ముల్లో డ్రాగన్ మొక్కల పెంపకం! 17
- జనం మరచిన ఆకుకూరలకు మళ్ళీ జీవం! 18
- వచ్చేస్తోంది ... రిమోట్ వ్యవసాయం ! 19
- ఐదారేళ్లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల హవా 20
- ప్రకృతి వ్యవసాయంలో రెండు గ్రామాలు 22
- 'వాష్' పై పెద్దపల్లి జిల్లాస్థాయి కార్యశాల 23
- పెట్టుబడిని రెట్టింపుచేసే కిసాన్ వికాస్ పత్ర! 25
- రూ.10వేలు..10సంవత్సరాలు..రూ.17లక్షలు 26
- ఎర్రచందనంతో ఎకరా పొలంలో రూ.10కోట్లు ! 27
- పంటవ్యర్థాలు తగలబెట్టే రైతులకు జరిమానా 28
- కల్తీ కాలంలో కాసులు కురిపించే గానుగ నూనె! 29
- కోళ్ళ పెంపకంతో రూ.15 కోట్ల ఆదాయం 30
- గృహిణులు ఇంటినుంచే చేయగలిగే వ్యాపారాలు! 31
- చిరుధాన్యాలతోనే ఆహార భద్రత ... ఐరాస 32
- లైంగిక వేధింపులపై రాజీపడినా కేసు పోదు 33
- ఒకే మామిడి చెట్టుకు 15 రకాల పండ్లు ! 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన చార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


నీ మిత్రుల భావోద్రేకాలతో ఆడుకోకు, ఆట గెలుస్తావేమో కాని శాశ్వతంగా వారికి దూరమవుతావు

# ఏపిమాస్ ఆధ్వర్యంలో స్వయంసహాయ విజయోత్సవం!

## ఉత్తమ సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు ... 22 రాష్ట్రాల ప్రతినిధుల హాజరు

– జె.వి. క్రిష్ణమూర్తి

**నిర్వహణ** : ఏపిమాస్
**తోడ్పాటు** : ఎస్ బి ఐ, డి జి ఆర్ వి, ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు బి, ఇసాఫ్, సా–ధన్, వాటర్ ఆర్గ్

2024 నవంబర్ 21–22 తేదీలలో హైదరాబాదు మహా నగరం భారతదేశ ముఖ చిత్రంగా మారిపోయింది. వివిధ రాష్ట్రాలకు అది కొలువు పీఠంగా విలసిల్లింది. ఈ అరుదైన దృశ్యాన్ని భాగ్యనగరంలో సాక్షాత్కరింపజేసిన ఖ్యాతి హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న సుప్రసిద్ధ స్వచ్ఛంద సంస్థ 'ఏపిమాస్'కు దక్కుతుంది.

స్వయంసహాయ ఉద్యమానికి, పేదరిక నిర్మూలన కృషికి, మహిళా సాధికారతకు, రైతు అభ్యుదయానికి చిరునామాగా మారిన ఏపిమాస్ కొందరు సహభాగస్వాముల తోడ్పాటుతో ఈ మహాసమ్మేళనానికి ఆధ్వర్యం వహించి, నిర్వహించింది.




అదే హైదరాబాదు యూసఫ్‌గూడలో రెండు రోజుల పాటు సాగిన జాతీయ స్వయంసహాయ సమాఖ్యల (ఎస్ హెచ్ జి ఫెడరేషన్స్) సమ్మేళనం, స్వయంసహాయ సమాఖ్యలకు జాతీయ పురస్కారాల ప్రదాన మహోత్సవం!

22 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా స్వయం సహాయ, అభివృద్ధి రంగ ప్రతినిధులు పాల్గొనిన ఈ సమ్మేళనం 'చిరు భారతావని కొలువు కూటం'గా విరాజిల్లింది.

ఇది అరుదైన సన్నివేశమే అయినా ఈ అరుదైన ఘనతను ఆవిష్కరించడం ఏపిమాస్‌కు ఇది నాలుగవసారి. 2021లో ప్రారంభించి, స్వయంసహాయ సమాఖ్యలకు జాతీయ పురస్కారాలను అందజేయడం వరుసగా యిది నాలుగవ సంవత్సరం!

**సమ్మేళనం ఆశయాలు**

1) భారతదేశ స్వయం సహాయ సమాఖ్యల విజయ ప్రస్థానాన్ని ప్రదర్శించడం, అభినందనోత్సవం జరపడం

2) స్వయంసహాయ సమాఖ్యలు చేపట్టిన వివిధ జీవనోపాధుల పెంపుదల కార్యక్రమాల, ముఖ్యంగా మహిళల ఆధ్వర్యంలోని పారిశ్రామిక, వ్యాపార సంస్థల నిర్వహణకు సంబంధించిన అనుభవాలను, పరిజ్ఞానాన్ని పదిమందితో పంచుకునే అవకాశం కల్పించడం.

3) పటిష్ఠమైన ఎఫ్‌పిఓల (వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల) నిర్మాణంలో, వాతావరణ మార్పులు విసిరే సవాళ్ళను ఎదుర్కోవడంలో స్వయంసహాయ సమాఖ్యలు నిర్వహించవలసిన కీలక పాత్రపై చర్చించి, అందుకు అవసరమైన వివిధ వ్యూహాలను రూపొందించడం.

ఈ ఉన్నత ఆశయాలతో ఏపిమాస్ ఈ సమ్మేళనాన్ని నిర్వహించింది.

రెండు రోజుల ఈ సమ్మేళనంలో తొలిరోజున జ్యోతి ప్రజ్వలనానంతరం 'స్వయం సహాయ సమాఖ్యలను, ఎఫ్

ప్రపంచానికి అసలు సమస్య హింసోన్మాదులతో కాదు, సాధు స్వభావం పేరుతో నోరు మెదపకుండా చూసేవారితో

### 54 అవార్డులు !

**20**24 నవంబర్ 22వ తేదీన ప్రదానం చేసిన పురస్కారాలతో సహా నాలు గేళ్ళుగా మొత్తం 54 అవార్డులు అందజేసినట్టు శ్రీ సి ఎస్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర : 10, రాజస్థాన్: 9, ఆంధ్రప్రదేశ్ : 8, కేరళ : 6, తెలంగాణా : 5

పి ఓలను ముప్పులను తట్టుకుని నిలిచి, సుస్థిరాభివృద్ధి చెందే సమ్మిళిత సంస్థలుగా రూపొందించడం' అనే అంశంపై 'ప్రారంభ సదస్సు జరిగింది.

ముందుగా దేశవ్యాప్తంగా స్వయంసహాయ ఉద్యమ సంఘటితత్వాన్ని ఎలుగెత్తి చాటుతూ, వివిధ రాష్ట్రాలకు చెందిన సమాఖ్యల సభ్యులు వివిధ భాషలలో గీతాలాపన చేశారు.

అనంతరం ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి స్వాగతోపన్యాసంచేస్తూ, మూడు దశాబ్దాలకు పైబడిన స్వయంసహాయ ఉద్యమ ప్రస్థానాన్ని, ఆ ఉద్యమంతో ఏపిమాస్ ప్రగాఢ అనుబంధాన్ని క్లుప్తంగా వివరించారు. ఈ సదస్సులు దేశవ్యాప్తంగా స్వయంసహాయ సమాఖ్యల




అనుభవాలకు, విజయగాధలకు, ప్రగతి పథంలో ఎదురవుతున్న సమస్యలకు దర్పణంగా నిలిచి, తగిన పరిష్కార మార్గాలను సూచించి, మరింత ప్రోత్సాహాన్ని అందించే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

స్వయం సహాయ స్ఫూర్తితో పేదరిక నిర్మూలనకు దోహదం చేయడంతో పాటు, లైంగిక సమానత్వ సాధనకు, అంతిమంగా మహిళా సాధికారతకు ఈ ఉద్యమం ఆలంబన కావాలన్న మహదాశయాన్ని, ఏపిమాస్ దార్శనిక గమ్యాన్ని ఆయన వివరించారు.

### కలసికట్టుగా !

**ఒ**క్కరికోసం అందరూ, అందరికోసం ప్రతి ఒక్కరూ నిలచి గృహహింసను మహిళలు ఎదుర్కోవాలని, సంఘీభావంతో మహిళా సాధికారతను సాధించాలని సెర్ప్ తెలంగాణా సి ఇ ఓ దివ్యా దేవరాజన్ సమాఖ్యల మహిళలకు పిలుపునిచ్చారు.

అనంతరం సెర్ప్ తెలంగాణా సి ఇ ఓ దివ్యా దేవరాజన్ ప్రత్యేక ప్రధాన వక్తగా జరిగిన తొలినాటి సర్వప్రతినిధి సమావేశంలో ఏపిమాస్ పాలకవర్గ సభ్యులు శ్రీ పి. మోహనయ్య, జర్మనీకి చెందిన డి జి ఆర్ వి సంస్థ ప్రతినిధి శ్రీ కోర్బీనియన్ మెర్జ్, అభివృద్ధిరంగ నిపుణులు శ్రీ రాజేష్ సింఘి, 'చైతన్య' సంస్థ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి సుధాకొఠారి, ఎన్ ఆర్ ఎల్ ఎమ్ ప్రతినిధి శ్రీ సౌరవ్ రాయ్ తమ ప్రసంగాలతో రెండు రోజుల సదస్సులకు దిశానిర్దేశం, మార్గదర్శనం చేశారు.

ఏపిమాస్ సీనియర్ కన్సల్టెంట్ శ్రీమతి కళామణి వందన సమర్పణతో ప్రారంభ సదస్సు ముగిసింది.

అనంతరం 'ఎస్ హెచ్ జి లు సుస్థిరాభివృద్ధి సంస్థలుగా కొనసాగడానికి అవసరమైన నవీకరణలు ... మహిళా గళాలు' అనే అంశంపై తొలి సర్వప్రతినిధి సమావేశం' (ప్లీనరీ) జరిగింది.

శ్రీ రాజేష్ సింఘి, చైతన్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి కల్పనా పంత్ మోడరేటర్లుగా వ్యవహరించిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన సమాఖ్యల ప్రతినిధులు తమ సంస్థలలో అనుసరిస్తున్న నవీన పద్ధతులు, ఉత్తమ విధానాలను, అవి అందిస్తున్న ఫలితాలను, సమాజంపై వాటి ప్రభావాలను వివరించారు.

సర్వప్రతినిధి సమావేశంతోపాటు తొలిరోజున రెండు

**అన్ని ప్రయత్నాలూ ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు, కాని ప్రయత్నమే లేనిది ఏ ఫలితమూ రాదు కదా!**




సమాంతర సదస్సులను నిర్వహించారు.

**'లక్షాధికారి దీదీ :** సమాఖ్యలు వ్యాపార, పారిశ్రామిక సంస్థలను నిర్వహించి, ఆటుపోట్లను తట్టుకునే శక్తిని పొందడం', 'ఎస్ హెచ్ జి సమాఖ్యలు తమ సంస్థల సభ్యులతో పాటు నిరుపేదలకు అనేక సేవలను అందించే సంస్థలుగా రూపొందడం' అనే రెండు అంశాలపై సమాంతర సదస్సులలో వివిధ రాష్ట్రాలకు చెందిన సమాఖ్యల ప్రతినిధులు తమ ఆలోచనలను, అనుభవాలను, అభిలాషలను పంచు కున్నారు. అనేక సూచనలు, సలహాలు అందించారు.

ఆ సాయంత్రం ఆటవిడుపుగా సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించగా, వివిధ రాష్ట్రాల సమాఖ్యల ప్రతినిధులు ఆనందోత్సాహాలతో ఆటపాటలలో పాల్గొన్నారు.

**రెండవ రోజు:**

'మూడు పూవులు, ఆరు కాయలు' అన్నట్టుగా రెండవ రోజున మూడు 'సర్వప్రతినిధి సమావేశాలు' (ప్లీనరీలు) జరిగాయి. ('వాతావరణ మార్పుల ముప్పును తప్పించడంలో మహిళా సంస్థల పాత్ర' , 'మహిళా ఎఫ్ పిఓల అభ్యుదయ సాధనకు అనుకూల వాతావరణ కల్పన' , 'ముప్పులను తట్టుకోగల మహిళా సంస్థల నిర్మాణం: కీలక భాగస్వాముల పాత్ర, వ్యూహాలు' అనే అంశాలపై ఈ ప్లీనరీలు జరిగాయి).

'సహకార సంస్థలు ; మెరుగైన ప్రపంచ నిర్మాతలు' అనే సందేశంతో, 2025 వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి 'అంతర్జాతీయ సహకార సంవత్సరం' గా ప్రటించిన నేపథ్యంలో ఆ సంవత్సర కాలానికి ఏపిమాస్ కార్యాచరణ ప్రణాళికను ఈ సమ్మేళనంలో ఆవిష్కరించారు.

ఇక ఈ రెండు రోజుల కార్యక్రమంలో శిఖర సదృశ్యమైన 'ఉత్తమ సమాఖ్యలకు జాతీయ పురస్కార ప్రదానోత్సవం' రెండవరోజు ముఖ్య విశేషం.జాతీయ స్థాయిలో మూడు, ప్రాంతీయ స్థాయిలో నాలుగు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలలో రెండు తెలుగు రాష్ట్రాలు జాతీయ స్థాయి మొదటి రెండు స్థానాలు సాధించడం విశేషం.

తెలంగాణాలోని హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల సమాఖ్య ప్రథమ బహుమతి పొందగా, ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తవనంపల్లి మండల మహిళా సమాఖ్య ద్వితీయ బహుమతి పొందింది. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాకు చెందిన హిర్కాణి మహిళా సమాఖ్య తృతీయ పురాస్కారాన్ని గెలుచుకున్నది.

ఇవి కాకుండా, రెండు సమాఖ్యలకు అభినందన పత్రాలను, మరో రెండు సమాఖ్యలకు ప్రత్యేకమైన వ్యాపార సంస్థను నిర్వహించే సమాఖ్యల విభాగంలో అవార్డులను అందించారు. ఆనంతరం ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి వందన సమర్పణ చేశారు.

స్వయంపోషక, స్వీయ నియంత్రిత సుస్థిరాభివృద్ధి సంస్థలుగా సమాఖ్యల భవ్య భవితవ్యానికి సలహాలు, సూచనలు అందిస్తూ, మార్గ నిర్దేశం చేస్తూ ఏపిమాస్ నిర్వహించిన రెండురోజుల జాతీయ సమ్మేళనం, పురస్కార మహోత్సవం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది. ■

నీ నవ్వుతో ప్రపంచాన్ని మార్చు, నీ నవ్వును మార్చే అవకాశం ప్రపంచానికి ఇవ్వకు

# స్వయం సహాయ సమాఖ్యలు : పురస్కారాలు

| జాతీయ స్థాయి విజేతలు | | | | | |
|---|---|---|---|---|---|
| జాతీయస్థాయి | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ / మండలం | జిల్లా | రాష్ట్రం |
| మొదటిది | ఎలకుర్తి మండలం మ్యూచువల్లీ ఎయిడెడ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో–ఆపరేటివ్ విలేజ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ | సెర్ప్, టిజి | ఎలకుర్తి | హనుమకొండ | తెలంగాణ |
| రెండవది | తవనంపల్లి మండలం సమాఖ్య మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ అండ్ క్రెడిట్ సొసైటీ లి॥ | సెర్ప్, ఏపీ | తవనంపల్లి | చిత్తూరు | ఏపీ |
| మూడవది | హిర్కనీ మహిళా ప్రభాగ్ సంఘ్ | ఎంఎస్ఆర్ఎల్ఎం | చిప్లున్ | రత్నగిరి | మహారాష్ట్ర |
| ప్రాంతీయ స్థాయి విజేతలు | | | | | |
| ఉత్తర ప్రాంతం | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ | జిల్లా | రాష్ట్రం |
| | భరతమాత రాజీవిక మహిళా సర్వజిన్ వికాస్ సహకారి సమితి లిమిటెడ్ ధిగ్వార్డ్ | రాజీవిక (ఎస్ఆర్ఎల్ఎం) | రాజ్‌ఘర్ | ఆల్వార్ | రాజస్థాన్ |
| దక్షిణ ప్రాంతం | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ | జిల్లా | రాష్ట్రం |
| మొదటిది | నవభారతి పరస్పర సహాయక సహకార ఎయిడెడ్ కో–ఆపరేటివ్ అండ్ క్రెడిట్ సొసైటీ లి॥ | సెర్ప్, టీజీ | రఘునాథ్‌పల్లి | జనగావ్ | తెలంగాణ |
| రెండవది | పూతలపట్టు మండల మహిళా సమాఖ్య | సెర్ప్, ఏపీ | పూతలపట్టు | చిత్తూరు | ఏపీ |
| తూర్పుప్రాంతం | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ | జిల్లా | రాష్ట్రం |
| మొదటిది | నాయి దిశ నారీశక్తి ఉమెన్ సెల్ఫ్–సపోర్టింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ | ఉమెన్&చైల్డ్ డెవలప్ మెంట్ కోఆపరేషన్ | పుల్వరీషరీఫ్ | పాట్నా | బీహార్ |
| ఈశాన్య ప్రాంతం | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ | జిల్లా | రాష్ట్రం |
| అభినందన పత్రం | సర్బ్రాజయ మహిళా క్లస్టర్ బాహుముఖి సంబాయ సమితి లిమిటెడ్ | ఎస్ఆర్ఎల్ఎం,త్రిపుర | అంబాస | ధాలాల్ | త్రిపుర |
| అభినందన పత్రం | తుల్కమ్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ | ఎన్ఆర్ఎల్ఎం, మిజోరం | సెర్చిప్ ఆర్డ్రీ బ్లాక్ | సెర్చిప్ | మిజోరం |
| ప్రత్యేకమైన వ్యాపార సంస్థను నిర్వహించు సమాఖ్యల విభాగ విజేతలు | | | | | |
| దక్షిణప్రాంతం | సమాఖ్య పేరు | ప్రోత్సాహక సంస్థ | బ్లాక్ | జిల్లా | రాష్ట్రం |
| మొదటిది | సమ్రితి & బ్లాజమ్ న్యూట్రిమిక్స్ యూనిట్ | కుదుంబశ్రీ స్టేట్ మిషన్, త్రివేంద్రం | అథియాన్నూర్ | త్రివేంద్రం | కేరళ |
| రెండవది | ది లింకెడా తాలూక మహిళా బాగ్యాత్ సహకారి మండల్ లిమిటెడ్ | ఎన్.ఎం.సద్గురు వాటర్& డెవలప్‌మెంట్ ఫౌండేషన్, దాహొడ్ | లిమ్‌ఖెడా | దాహొడ్ | గుజరాత్ |
| మూడవది | తేజస్విని నారీ చేతనా మహిళా సంఘ్ మహేంద్వని | తేజస్విని రూరల్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం, భోపాల్ | మెహన్ద్వాని | దిండోరి | ఎంపీ |

చిల్లర నాణాలు శబ్దం చేస్తాయి, విలువైన నోట్లు నిశ్శబ్దంగా వుంటాయి; ప్రశాంతంగా వుండు, నీ విలువ పెంచుకో

# సేంద్రియ వ్యవసాయానికి బాసటగా బయోచార్ !

- జి ఆర్ అమరేంద్ర

బయోచార్ అనేది ఒకరకమైన బొగ్గులాంటి పదార్ధం. సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. బయోచార్ ప్రధానంగా నేలల్లో మట్టి రేణువుల మధ్య గాలిని పెంచ డానికి, గ్రీన్‌హౌస్ వాయువుల నేల ఉద్గారాలను తగ్గించ డానికి, పోషకాల లీచింగ్‌ను తగ్గించడానికి, నేల ఆమ్లతను



తగ్గించడానికి, ముతక నేలల నీటిశాతాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు. బయోచార్ వాడకం వలన నేల సారవంతమై, దిగుబడులు పెరుగుతాయి.

**బయోచార్ ఉత్పత్తి:**

పారిశ్రామికంగా బయోచార్‌ను ప్రత్యేక పరికరాల సహాయంతో ఉత్పత్తి చేస్తారు. ఆయితే, రైతులు స్వయంగా కూడా పొలాలలోనే తమ పద్ధతులలో బయోచార్‌ను తయారు చేసుకుంటారు. చిన్నకారు రైతులు పంట వ్యర్థాలను (ఉదా.. మొక్కజొన్న కాండాలు, వరి గడ్డి లేదా గోధుమ గడ్డిని) కుప్పలుగా పోసి, కుప్పల పైభాగాన నిప్పు రాజేస్తారు. మట్టి లేదా నీటిని నిప్పులపై చల్లుతారు. పంట వ్యర్థాలను కాల్చే సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఈ పద్ధతి పొగను బాగా తగిస్తుంది.

**వ్యవసాయంలో బయోచార్ ఉపయోగాలు:**

బయోచార్ నీటి నాణ్యతను , మట్టి నాణ్యతను మెరుగు పరుస్తుంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గిస్తుంది, పోషకాల లీచింగ్‌ను తగ్గిస్తుంది. నేల ఆమ్లతను తగ్గిస్తుంది పంటలకు నీటి అవసరాన్ని, ఎరువుల అవసరాలను తగ్గిస్తుంది. బయోచార్ ఆకుల శిలీంధ్ర వ్యాధులకు మొక్కల ప్రతిస్పందనలను ప్రేరేపిస్తుంది. మొక్కలకు మట్టి ద్వారా సంక్రమించే తెగుళ్ళను ఎదుర్కోవడంలో మొక్కల ప్రతిస్పందన లను మెరుగుపరుస్తుంది. బయోచార్ వాడకం వలన పంట దిగుబడి పెరుగుతుంది.

**బయోచార్ వాడవలసిన తీరు :**

బయోచార్ ఏ పంటలకైనా వాడవచ్చు, దీనిని సేంద్రియ ఎరువుతో కలిపి వాడాలి. ఒక ఎకరాకు 1-2 టన్నుల బయోచార్ వాడకం వలన ఎక్కువ ప్రయోజనం కలిగినట్లు వివిధ అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఆమ్ల నేలల్లో బయోచార్ వేస్తే, ఆమ్లస్థాయి తగ్గి, తటస్థ స్థితికి వచ్చి వ్యవసాయం లాభసాటిగా వుంటుంది.

**బయోచార్‌లో వివిధ సంస్థల సహకారం:**

చెన్నైకి చెందిన 'మురుగప్ప చెట్టియార్ రీసెర్చ్ సెంటర్' వారు ఏపిమాస్, వాసన్, బాల వికాస లాంటి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటుతో వ్యవసాయంలో బయోచార్ విని యోగం కోసం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో పని చేస్తున్నారు. ఏపిమాస్ సంస్థతో కలసి అనంతపురం జిల్లాలో 'క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ', అన్నమయ్య జిల్లాలో 'రాయలసీమ వాటర్ ఇనీషియేటివ్ ప్రాజెక్టు' ప్రాంతాలలో వీరు పని చేస్తున్నారు. ■



# 'రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్' పై శ్రీ సి ఎస్ సమీక్ష

– వాసు

ఏపిమాస్ సి.ఇ.ఒ శ్రీ సి.ఎస్ రెడ్డిగారు, అన్నమయ్య జిల్లా రెండురోజుల (నవంబరు 18 మరియు 19 తేదీలలో) పర్యటనలో భాగంగా, నవంబరు నెల 18వ తేది ఉదయం ఏపిమాస్ క్షేత్ర కార్యాలయములో రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ సిబ్బందితో బేస్ లైన్ సర్వేపై, ప్రగతిపై సమగ్రంగా చర్చించారు. మొత్తం 143 ఆవాసాలకు గాను, ఇంతవరకు, హౌస్ హోల్డ్ (గృహ) సర్వే 123



ఆవాసాలలో, లైవ్ స్టాక్ (పశుసంపద) సర్వే 123 ఆవాసాలలో, ఇ–పి.ఆర్.ఎ 93 ఆవాసాలలో, బోరుబావులు/బావుల సర్వే 49 ఆవాసాలలో పూర్తి అయినట్లు సిబ్బంది తెలియజేశారు. అనుకొన్న సమయానికి బేస్ లైన్ సర్వే పూర్తి చేయటకు తగు సూచనలు చేయడమైనది.

ఇ–పిఆర్ఎ డిజిటైజేషన్(కంప్యూటరీకరణ) గురించి క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఇ–పిఆర్ఎ డిజిటైజేషన్ ద్వారా నేల రకాలు, నేల వినియోగము, బీడు భూముల వర్గీకరణ, పంటల రకాలు, సాగు విధానము, పంట సీజను మొదలగు మ్యాపులను పరిశీలించారు. అవి మరింత బాగా అర్థం కావడానికి రంగులు మొదలైన అంశాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. ఈ మ్యాపుల ద్వారా కుటుంబాల స్థితిగతులను, జీవనోపాధులను, పంట విధానాలను, నీటి వనరులను, సాగు చేయు పంటలను గురించి ఎలా అర్థం చేసుకోవాలో, ఈ సమాచారం ఆధారంగా ప్రణాళికలను ఎలా చేసుకోవాలో వివరించారు..

తరువాత మదనపల్లి మండలం, కోళ్ళబైలు పంచాయతికి చెందిన మిట్టామద్రి హెచ్ డబ్ల్యులో భూములను, వనరులను, కాలినడకన తిరగి పరిశీలించారు. ఇందులో వివిధ వర్షాధార పంటలను, సాగునీటి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయు మిశ్రమ పంటలైన రాగి, కంది, అనప, ఉలవ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడివి పందుల బెడద వలన వేరుశనగ సాగును చేయలేక పోతున్నామని రైతులు తెలియజేశారు. ఆ ఆవాసానికి సంబంధించి గుర్తించిన నీటి సంరక్షణ పనులను పరిశీలించారు. అడవి జంతువుల బెడద, సకాలంలో వర్షాలు రాకపోవడం వలన బీడు భూములు ఎక్కువగా వున్నట్లు గుర్తించారు. అక్కడ నివసిస్తున్న 39 కుటుంబాలవారు కూర్చొని ప్రాధమిక సర్వే సమాచారం ఆధారంగా రాబోయే 4 సంవత్సరాలకు సంబంధించిన ప్రణాళికలను తయారు చేసుకోవలసినదిగా గ్రామస్తులకు శ్రీ సి ఎస్ రెడ్డి సూచించారు.

తరువాత మదనపల్లి మండలం, పొన్నూటిపాలెం పంచాయతీ అమ్మగారిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామంలో సమావేశం నిర్వహించి అక్కడి 14 ఎస్.సి కుటుంబాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఒక బోరుబావి నీటిని తామందరం పంచుకొంటున్నట్లు వారు తెలియజేశారు. బేస్ లైన్ సర్వే సమాచారాన్ని గ్రామస్థులతో నిర్ధారించుకున్నారు. అక్కడ నీరు, పంట భద్రతకు సంబంధించి 6 పనులను గుర్తించి వాటికి అంచానాలు తయారు చేయడం జరిగిందని, మొత్తం అంచనా రూ.4.87 లక్షలు కాగా, వీటిలో రూ.3.50 లక్షల విలువైన పనులను



స్నేహమే నీ బలహీనత అయితే, నిన్ను మించిన బలవంతుడు వేరొకడు వుండడు



ఆర్.డబ్లు.ఐ నిధులతోను, రూ.1.37 లక్షల విలువైన పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేసుకోవాలని నిర్ణ యించినట్లు కమ్యూనిటి ప్రతినిధులు, ప్రాజెక్టు సిబ్బంది తెలియజేశారు. ప్రణాళికలు, పనుల అమలు పర్యవేక్షణకు ఆవాస స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసుకొనినట్లు కూడా వారు తెలిపారు. ఇక్కడ ప్రధాన పంటలు టమాట, వరి, వేరుశనగ అని, వేరుశనగకు అడివి జీవాల బెడద ఎక్కువని, ఊటకుంటను నిర్మించుకుని, బీడు భూములను సాగు చేసుకోవాలని ఆశిస్తున్నామని రైతులు తెలిపారు.

నీరు ,తెగుళ్ళ సమస్యలను పరిష్కరించుకొనుటకు 14 కుటుంబాలవారు కూర్చొని, బేస్ లైన్ సర్వే సమాచారాన్ని ఇ–పిఆర్ఎ మ్యాపుతో సరిపోల్చుకుంటూ, ప్రాజెక్టు సిబ్బంది సహకారంతో నీరు, పంట భద్రత, ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను గుర్తించి, గుర్తించిన కార్యక్రమాలకు కార్యా చరణ ప్రణాళిక తయారుచేసుకొని, ప్రణాళిక ప్రకారం పనుల అమలు , పర్యవేక్షణ చేసుకోవలసినదిగా శ్రీ సి ఎస్ రెడ్డి కమ్యూనిటీకి సూచించారు.

తదనంతరం, బేస్ లైన్ సర్వేలో భాగమైన గృహ



సర్వే, లైవ్ స్టాక్ (పశుసంపద) సర్వే, ఇ–పిఆర్ఎ, బోరుబావులు/బావుల సర్వే సమాచారాన్ని ఆవాస స్థాయిలో క్రోడీకరించడం, విశదీకరించి, విశ్లేషించి, ఆవాస కమ్యూనిటితో కూర్చొని వారికి వివరించి, ప్రశ్నించడం ద్వారా వారిని ఆలోచింపచేసి, సమగ్ర ప్రణాళికలు తయారు చేసుకొని అమలు చేసుకొనే విధంగా ప్రేరేపించి, రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్‌ను ప్రజలే ముందుండి నడిపించుకునే విధంగా ప్రాజెక్టు సిబ్బందికి దిశానిర్దేశం చేసి, శ్రీ సి ఎస్ రెడ్డి ప్రాజెక్ట్ సందర్శనను ముగించారు. ■

## స్వయంసహాయ సంఘాలకు 600 బస్సులు, సోలార్ ప్లాంట్లు

తెలంగాణాలోని మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సీఎం శ్రీ రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు పలు చర్యలు చేపడుతున్నట్లు సీఎస్ శాంతకుమారి తెలిపారు. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమం అమలుపై ఆమె ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, మహిళా సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని నిర్ణయించామని, మొదటి దశలో భాగంగా 150 బస్సులను వెంటనే కొనడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మహిళా సంఘాల ద్వారా 4,000 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించనున్నామని, మొదటి దశలో 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తామని వివరించారు.

ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను టీజీరెడ్కో, డిస్కమ్‌లు చేపడతాయన్నారు. రాష్ట్రంలో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శిల్పారామంలో 106 షాపులతో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలోగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ■

చిరునవ్వుకు అర్థం విచారం లేకపోవడం కాదు, విచారాన్ని ఎలా నిగ్రహించుకోవాలో తెలియడం

# సేంద్రియ మిరపపంట క్షేత్ర దినోత్సవం

– జి.ఆర్. అమరేంద్ర

**మ**దనపల్లె మండలం ఎనుములవారిపల్లి లోని యం. జనార్ధన రెడ్డి పొలంలో 2024 నవంబర్ 22 వ తేదీన సేంద్రియ మిరప పంట క్షేత్ర దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి రైతులు, కమ్యూనిటి రిసోర్స్ పర్సన్స్, రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్టులోని స్వచ్ఛంద సంస్థల (జనజాగృతి,యఫ్.ఇ.యస్) ప్రతినిధులు, ఏపిసిఎన్ఎఫ్, వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ మండల సిబ్బందితోసహా మొత్తం 82 మంది హాజరైనారు.



**ప్రదర్శన క్షేత్ర సందర్శన :** ఈ కార్యక్రమానికి వచ్చిన వారు ముందుగా సేంద్రియ మిరప పొలాన్ని సందర్శించి, పొలంలో పాటించిన సేంద్రియ వ్యవసాయ పద్ధతులను, పంట ఆరోగ్యం తీరుతెన్నులను పరిశీలించారు. క్షేత్ర ప్రదర్శన రైతు ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

**ప్రత్యక్ష ప్రదర్శన :** సి ఆర్ పి సుజాత, ఎపిసియన్ఎఫ్ సిబ్బంది జీవామృతం తయారీ విధానాన్ని కమానుగుణంగా ప్రత్యక్ష ప్రదర్శనగా చేసి చూపించారు. జీవామృతం వల్ల భూమికి జరిగే మేలు, వివిధ పంటలపై జీవామృతం ప్రభావం, పంటలకు దశల వారీ వాడే మోతాదులను గురించి వారు వివరించారు.

**ప్రదర్శనలు :** మ్యానేజ్ సంస్థ అభివృద్ధి పరచిన 18 రకాల ప్రకృతి వ్యవసాయ పోస్టర్స్, కషాయాల, ద్రావకాల నమూనాలు, బయో ఇన్పుట్స్, సేంద్రియ, రసాయనిక వ్యవసాయంలో పండించి, కోసిన మిరప పంట నమూనాలను కోసిన తర్వాత ఎంతకాలం అవి తాజాగా, నాణ్యంగా వుంటాయో తెలుసుకుఅనే ఏర్పాట్లు చేశారు. ఈ ప్రదర్శనలపై ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను ఏపిమాస్ సిబ్బంది నివృత్తి చేశారు.

**మండల వ్యవసాయ అధికారి :** సేంద్రియ వ్యవసాయం పచ్చిరొట్ట పంటలతో మొదలు పెట్టి, నూనె చెక్కలు, పశువుల ఎరువు లాంటివి వాడి భూసారం అభివృద్ధి పరిచి, పంటలో సమగ్ర వ్యవసాయ పద్ధతులు ఆచరించడం వలన రైతులకు అవగాహన ఏర్పడి సేంద్రియ వ్యవసాయం చేయటనికి ముందుకు వస్తారని మండల వ్యవసాయ అధికారి చెప్పారు.

**ఉద్యానశాఖ అధికారి :** రైతులు పొలంలో పంట మార్పిడి చేయడం అనగా కూరగాయ పంట తరువాత లెగూమినేసి పప్పుధాన్యాల నిచ్చే పంటలు, రాగి, ప్రొద్దు తిరుగుడు లాంటి పంటలు మార్చి వేయడం వలన భూసారం పెరగడం, తెగుళ్ళు తగ్గడం జరుగుతుంది.

**బావాజాన్, ఎపిసియన్ఎఫ్ :**

ప్రకృతి వ్యవసాయ అనుభవాలు, ప్రకృతి వ్యవసాయంలో ఐదు స్తంభాల వంటి 1. బీజామృతం 2. ఘన జీవామృతం 3.ద్రవ జీవామ్రుతం 4. మల్చింగ్ 5. వాప్స గురించి వివరిచడం జరిగింది.

ఈ కార్యక్రమం తమకు ఒక నమ్మకం కలిగించినట్లు క్షేత్ర దినోత్సవంలో పాల్గొన్న రైతులు పేర్కొన్నారు.



అందరూ ప్రదర్శన క్షేత్ర రైతును అభినందించారు. ■

**అవకాశాలు సూర్యోదయం లాంటివి, ఏ రోజు జాప్యం చేస్తే ఆ రోజుకు ఇక అంతే, చేయిజారినట్టే !**

# అంతర్జాతీయ సహకార సంవత్సరానికి శ్రీకారం !

2025వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఆ స్ఫూర్తిని, ప్రేరణను అందిపుచ్చుకుని మన దేశం సహకార రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడానికి, పునర్ వైభవం కల్పించడానికి సమాయత్తమైంది. ఈ దిశగా నవంబర్ 25 వ తేదీన ఢిల్లీలోని భారత్ మంటపంలో 'ప్రపంచ సహకార సదస్సు-2024' పేరిట సన్నాహక సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా, శ్రీ మోదీ అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని లాంఛనంగా ప్రారంభించి, స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారు.

అనంతరం ప్రధాని ప్రసంగిస్తూ, 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది పేదలకు, రైతులకు వరం లాంటిదని అన్నారు. 'సహకారంతో సమృద్ధి' (సహకార్ సే సమృద్ధి) అనే కేంద్ర ప్రభుత్వ పథకం లక్షలాది గ్రామాలకు, మహిళలకు, రైతులకు ప్రగతిదాయకంగా నిలచిందని ఆయన పేర్కొన్నారు.

మన దేశంలో సహకార సంస్థలు సంస్కృతికి, జీవన విధానానికి ఆధారపీఠాలని శ్రీ మోదీ కొనియాడారు. మన దేశ సహకార స్ఫూర్తి ఆలోచన నుంచి, ఉద్యమానికి, ఉద్యమం నుంచి విప్లవానికి, విప్లవం నుంచి సాధికారతకు మహోన్నత ప్రస్థానం సాగించిందని మోదీ పేర్కొన్నారు. సహకార రంగంలో మహిళల పాత్ర గణనీయమైందని మోదీ ప్రశంసించారు. స్వాతంత్ర్యానంతరం 75 ఏళ్ళ తర్వాత భారత సహకారరంగం ఉత్సాహాన్ని నింపుకుని, పునర్ వైభవాన్ని సంతరించుకున్నదని, వచ్చే మూడేళ్ళలో మన దేశంలో సహకార సంస్థ లేని గ్రామమంటూ వుండదన్నారు.

ఈ సమ్మేళనంలో శ్రీ మోదీతో పాటు భూటాన్ ప్రధాని శ్రీ దేషో షేరింగ్ టోబ్ గే, ఫిజి ఉప ప్రధాని శ్రీ మనో కమికమిక, కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా, మన దేశంలో ఐక్యరాజ్య సమితి స్థానిక సమన్వయ కర్త శ్రీ శౌంబి షార్ప్, అంతర్జాతీయ సహకార సమాఖ్య ప్రెసిడెంట్ శ్రీ ఏరియల్ గూర్కో, వివిధ దేశాల ప్రతినిధులు తదిరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సరంలో నూతన సహకార విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, భారతీయ సహకార రంగాన్ని కొత్తపుంతలు తొక్కించడం జరుగుతుందని శ్రీ మోదీ దృఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఏర్పాటయ్యే మూడు నూతన సహకార సంస్థలు రైతులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం కల్పిస్తాయని ఆయన వివరించారు.

సహకార రంగంలో అగ్రశ్రేణి నిపుణులను తయారు చేయడం కోసం త్వరలోనే సహకార విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పుతామని శ్రీ మోదీ ప్రకటించారు. భారతీయ సహకార వ్యవస్థ అంతర్జాతీయ సహకార రంగానికి నూతన శక్తి సామర్థ్యాలను సంతరిస్తుందని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు.

విశ్వ సహకార సంవత్సరానికి ఈ ఆహ్వానం కేవలం తానొక్కడిదే కాదని, వేలాది రైతులు, పశుపోషకులు, మత్స్యకారులు, 8 లక్షలకు పైగా సహకార సంఘాలు, స్వయంసహాయ సంఘాలకు చెందిన 10 కోట్ల మహిళలు, సహకార రంగానికి సాంకేతిక మెరుగులు దిద్దుతున్న యువత … వీరందరూ సహకార సంవత్సరానికి స్వాగతగీతం ఆలపిస్తున్నారని శ్రీ మోదీ పేర్కొన్నారు.

అంతర్జాతీయ సహకార సమాఖ్య మనదేశంలో విశ్వ సహకార సదస్సు నిర్వహించడం యిదే మొదటి సారి అని , మనదేశంలో సహకార రంగాన్ని విస్తరిస్తున్న దశలో ఈ సదస్సు నిర్వహించడం విశేషమని శ్రీ మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

■

నీవు ఏ దృష్టితో చూస్తే అదే రకంగా ప్రపంచం నీకు కనిపిస్తుంది, దృష్టి కోణం మార్చి చూడు అంతా అద్భుతమే!

# వయసునుబట్టి మహిళల పోషకాహారాలలో మార్పు

– డా. బి.నీహారిక, డా. జి.ప్రసాద్‌బాబు, డా.యం.శేషుమాధవ్

**పౌ**ష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి జీవితాంతం మంచి ఆరోగ్యం కలిగి ఉండడానికి రెండు ముఖ్యమైన స్తంభాలు. పోషకాహారం సరిగా లేకపోవడం, చిన్న వయస్సులో ఆరోగ్యం ప్రాముఖ్యత గురించి అవగాహన లేకపోవడం ముఖ్యంగా స్త్రీల విషయంలో ఆరోగ్యం క్షీణతకు దారి తీస్తున్నాయి. మహిళల పోషకాహార అవసరాలు వివిధ దశల్లో మారుతూ ఉంటాయి. వయస్సు, శారీరక శ్రమస్థాయి, జీవన శైలి, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలు మహిళల పోషకాహార అవసరాల్ని బాగా ప్రభావితం చేస్తాయి.

చిన్న వయస్సులో, బలమైన ఎముకలను నిర్మించడానికి కాల్షియం, విటమిన్ డి చాలా ముఖ్యమైనవి. చిన్న వయస్సులో, అమ్మాయిలు, అబ్బాయిల పోషకాహార అవసరాలు ఒకే రకంగా ఉంటాయి. కానీ యుక్త వయస్సు వచ్చిన వెంటనే వ్యత్యాసం ప్రారంభమవుతుంది. యుక్త వయస్సు ప్రారంభమైన తర్వాత, స్త్రీ శరీరంలో అనేక శారీరకమైన, హార్మోన్ల పరమైన మార్పులు జరుగుతాయి, అవి స్త్రీల పోషక అవసరాలను ప్రభావితం చేస్తాయి. యువతులకు వారి అభివృద్ధి చెందుతున్న శరీరాలకు మద్దతు ఇవ్వడానికి మరింత శక్తి అవసరం. ఋతుస్రావం కోసం అదనపు ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు అవసరం.

గర్భధారణ సమయంలో తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రోటీన్, కాల్షియం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు సాధారణం కంటే ఎక్కువగా అవసరమవుతాయి. ఈ అవసరాలు తల్లి పాలు ఇస్తున్నంత కాలం కొనసాగుతాయి. స్త్రీలు రుతువిరతి (మెనోపాజ్) దశలోకి ప్రవేశించిన తర్వాత, ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉండటంవల్ల గుండెజబ్బులు, మధుమేహం మొదలైన దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతారు. రుతువిరతికి సంబంధించిన హార్మోన్ల మార్పులు కాల్షియం, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్లు, మెగ్నీషియం మొదలైన సూక్ష్మపోషకాల కోసం ఎక్కువ అవసరాన్ని సృష్టిస్తాయి.

**ప్రోటీన్ (మాంసకృత్తులు)**

శరీరానికి ప్రోటీన్ చాలా అవసరం. ఇది కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, ఎంజైమ్‌లు, హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. కండర వ్యవస్థను దృఢంగా ఉంచడంలో ప్రోటీన్లది కీలక పాత్ర.

ఎముకలు, కండరాలు, చర్మం, రక్తం పెరుగుదలకు ప్రోటీన్ అవసరం. శరీరం బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు, రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రోటీన్ తోడ్పడుతుంది. ప్రోటీన్ హిమోగ్లోబిన్‌ను రవాణా చేస్తుంది, ఇది మన కణాలన్నింటికీ ఆక్సిజన్‌ను అందిస్తుంది. సాధారణంగా రోజుకు కిలో బరువుకి ఒక గ్రాము ప్రోటీన్ అవసరం. సోయాబీన్స్, బఠానీలు, పప్పుదినుసులు, పాల పదార్థాలు, చేపలు, చికెన్, మటన్ లలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి.

**విటమిన్ బి 9 (ఫోలిక్ యాసిడ్)**

హిమోగ్లోబిన్ సంశ్లేషణకు విటమిన్ బి 9 అవసరం. ఫోలేట్ గర్భధారణకు ముందు, మొదటి త్రైమాసికంలో తీసుకుంటే నాడీ సంబంధిత పుట్టుక లోపాలను బాగా తగ్గిస్తుంది. ఇది గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్ల నుండి రక్షించడానికి కూడా సహాయపడుతుంది.

రుతుక్రమం ఆగిన దశలో, ఇది ఈస్ట్రోజెన్‌ను ఉత్పత్తి చేయడంలో శరీరానికి సహాయపడుతుంది. ఫోలిక్ యాసిడ్లో పంమాక్రో సైటిక్ అనీమియాకు దారి తీస్తుంది. ఫోలిక్ యాసిడ్స్ సప్లిమెంట్సు పుట్టిన బరువును పెంచుతాయి. మరియు పుట్టుకతో వచ్చే క్రమరాహిత్యాలను తగ్గిస్తాయి.

యుక్త వయసులో ఉన్న అమ్మాయిలు, మహిళలు రోజు తీసుకునే ఆహారంనందు కనీసం 220–270 మైక్రో గ్రాముల ఫోలిక్ యాసిడ్ ఉండేలా చూసుకోవాలి. గర్భిణులకు రోజుకు 570 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్అవసరం. పాలిచ్చే

తల్లులకు రోజుకు 330 మైక్రోగ్రాముల ఫోలిక్ యాసిడ్ అవసరం. పచ్చిఆకుకూరలు, చిక్కుళ్ళు, గింజలు, కాలేయం ఫోలిక్ యాసిడ్ మంచి మూలాలు.

**విటమిన్ బి 12**

ఇది ఎర్రరక్తకణాలు ,న్యూరాన్లు సక్రమంగా పని చేసేలా చేయడంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో, విటమిన్ బి12 శిశువు అభివృద్ధికి , ఆరోగ్యకరమైన బరువుకు చాలా ముఖ్యమైనది. మహిళల్లో వయసు పెరిగే కొద్దీ విటమిన్ బి 12 శోషణ సామర్థ్యం తగ్గుతుంది. శాకాహారులు విటమిన్ బి12 లోపానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది, ఎందుకంటే విటమిన్ బి12 ఎక్కువగా జంతు ఆధారిత ఆహారాల ద్వారా లభిస్తుంది.

యుక్తవయసు అమ్మాయిలు, మహిళలు రోజూ తీసుకునే ఆహారంలో కనీసం 2.2 మైక్రో గ్రాముల విటమిన్ బి12 ఉండేలా చూసుకోవాలి. గర్భిణు లకు రోజుకు 2.5 మైక్రోగ్రాముల విటమిన్ బి12 అవసరం. పాలిచ్చే తల్లులకు రోజుకు 3.2 మైక్రోగ్రాముల విటమిన్ బి12 అవసరం. తృణధాన్యాలు, సోయా, పాలు, పెరుగు, గుడ్లు, కాలేయం, చేపలు, పుట్టగొడుగులు, విటమిన్ బి12 జోడించిన ఆహారాలు విటమిన్ బి12 మంచి మూలాలు.

**విటమిన్ సి**

విటమిన్ సి గాయాలను నయం చేయడంలో, ఎర్ర రక్త కణాల ఉత్పతిలో సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఎముకలకు, సిరలకు విటమిన్ సి చాలా అవసరం. శరీరం లో అన్నిరకాల కణజాలాలను వృద్ధి చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఇనుము శోషణను పెంచుతుంది. మానసిక స్థితినీ మెరుగుపరుస్తుంది. హుషారు, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. మెదడులో నాడీ సమాచార వాహికల ఉత్పత్తికి విటమిన్ సి అవసరం. యుక్తవయసులో ఉన్న అమ్మాయిలు మరియు మహిళలు రోజు తీసుకునే ఆహారంనందు కనీసం 65 మి.గ్రా. విటమిన్ సి ఉండేలా చూసుకోవాలి. గర్భిణి స్త్రీలకు ప్రతిరోజూ 80 మి.గ్రా. విటమిన్ సి అవసరం. పాలిచ్చే తల్లులకు ప్రతిరోజూ 115 మి. గ్రా. విటమిన్ సి అవసరం. వయసు పెరిగే కొద్దీ విటమిన్ సి స్థాయులు తగ్గుతాయి. నారింజ, నల్లఎండుద్రాక్ష, కివీ ఫ్రూట్, మామిడి, బ్రోకలీ, బచ్చలికూర, క్యాప్సికం మరియు స్ట్రాబెర్రీలు విటమిన్సిని అందిస్తాయి.

**విటమిన్ డి**

కాల్షియం యొక్క సరైన జీవక్రియకు విటమిన్ డి అవసరం. విటమిన్ డి కాల్షియం మరియు ఫాస్పరస్‌ను రక్తప్రవాహంలోకి తరలించడానికి సహాయపడుతుంది. విటమిన్ డి లోపించడం వలన ఎముకలు బలహీన పడతాయి. ఇది కణాలలో మంటను తగ్గించడంలో మరియు రోగనిరోధకశక్తిని బలోపేతం చేయడంలో కూడా సహాయ పడుతుంది. సూర్యరశ్మి ద్వారా శరీరంలో విటమిన్ డి స్థాయి లు మెరుగుపడతాయి. రోజుకు 400 ఐ.యూ. విటమిన్ డి అవసరం. అదనంగా, గుడ్లు మరియు చేపలు (సాల్మన్, మాకేరెల్)విటమిన్ డిని అందజేస్తాయి. వృద్ధులైన మహిళలకు విటమిన్ డి తో కూడిన ఆహారాలు ఎంతో అవసరం.

**కాల్షియం**

మహిళలకు జీవిత కాలం కాల్షియం చాలా అవసరం. ఆరోగ్యకరమైన ఎముకలు మరియు దంతాలకు ఇది ముఖ్యం. గుండె, కండరాలు, నరాలు సక్రమంగా పని చేయడానికి మరియు రక్తం గడ్డకట్టడానికి కాల్షియం అవసరం. ఆహారం లో కాల్షియం లోపించినప్పుడు శరీరం సరైన కణాల పనితీరు కోసం ఎముకల నుండి కాల్షియం తీసుకుంటుంది, ఇది తక్కువ ఎముక ద్రవ్యరాశికి కారణమయ్యే బోలు ఎముకల వ్యాధికి దారి తీస్తుంది.

యుక్తవయసులో ఉన్న అమ్మాయిలు, మహిళలు మరియు గర్భిణి స్త్రీలు రోజు తీసుకునే ఆహారం నందు కనీసం 1000 మి.గ్రా. కాల్షియం ఉండేలా చూసు కోవాలి. అయితే బాలింతలకు పాల ఉత్పత్తి మరియు శిశువు పోషకాహార అవసరాలు తీర్చుటకు ప్రతిరోజు 1200 మి. గ్రా. కాల్షియంఅవసరం.

పాలఉత్పత్తులు, ఆకుకూరలు, నువ్వులు, పొద్దు తిరుగుడు విత్తనాలు, బాదం, చియా విత్తనాలు, సబ్జాగింజలు, రాగులు, శనగలు, సోయాబీన్స్ మరియు చేపలు నుండి కాల్షియం పొందవచ్చు.

**కష్టపడి పనిచేయడం ముఖ్యమే, కాని అంతకంటె ముఖ్యమైనది ఆత్మవిశ్వాసం**

**మెగ్నీషియం**

మెగ్నీషియం స్థిరమైన గుండె లయ మరియు బలమైన ఎముకలకు చాలా అవసరం. రక్తంనుండి ఎముకలోకి కాల్షియం శోషణకు మెగ్నీషియం అవసరం. ఇది చక్కటి నిద్ర వచ్చేలా చేస్తుంది. బ్లడ్‌షుగర్‌ను కంట్రోల్ చేస్తుంది. హార్మోన్స్ సరిగా పని చేసేందుకు సాయపడుతుంది. సాధారణంగా రోజుకు 350–400 మి. గ్రా. మెగ్నీషియం అవసరం. ఆకుపచ్చని కూరగాయలు, బ్రోకలీ, దోసకాయ, గ్రీన్బీన్స్, సెలెరీ, సోయాబీన్స్ మరియు తృణధాన్యాలు మెగ్నీషియం యొక్క మంచి మూలాలు.

**ఐరన్ (ఇనుము)**

ఐరన్ అనేది మహిళలకు చాలా ముఖ్యమైన ఖనిజం. ఆక్సిజన్‌ను మోసుకెళ్లే ఎర్ర రక్తకణాల తయారీకి ఇది అవసరం. మానసిక పనితీరుకు మరియు వ్యాధుల నుండి సంరక్షించే రోగనిరోధక శక్తిని పెంచడానికి ఐరన్ అవసరం. దీని లోపం రక్తహీనతకు దారి తీస్తుంది. యువకులు మరియు గర్భిణీ స్త్రీలు రక్తహీనతకు ఎక్కువగా గురవుతారు. ఋతు స్రావం సమయంలో చాలా రక్తం పోతుంది కాబట్టి ఐరన్ క్షీణిస్తుంది. కాబట్టి, పునరుత్పత్తి వయస్సులో ఉన్న బాలికలు తమ ఆహారంలో తప్పనిసరిగా ఐరన్‌ను చేర్చుకోవాలి. గర్భధారణ సమయంలో, రక్తం యొక్క పరిమాణం దాదాపు రెట్టింపు అవుతుంది కాబట్టి ఐరన్ అవసరం కూడా పెరుగుతుంది. అలాగే చనుబాలిచ్చే సమయంలో శిశువుకు తల్లిపాల ద్వారా ఇనుము అందుతుంది కాబట్టి తల్లి మంచి మొత్తంలో ఐరన్ తీసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా రోజుకు 25–30 మి.గ్రా. ఐరన్ అవసరం. పచ్చి ఆకు కూరలు, చిక్కుళ్ళు, బీట్రూట్, దానిమ్మవిత్తనాలు, గుమ్మడి కాయ విత్తనాలు మరియు డ్రైఫ్రూట్స్ నందు ఐరన్ అధిక మొత్తంలో ఉంటుంది. మాంసం మరియు చేపలు ద్వారా కూడా ఇనుము లభిస్తుంది. విటమిన్ సి అధికంగా ఉన్న ఉసిరి, జామ మరియు నిమ్మజాతికి చెందిన పుల్లని పండ్లు ఇనుము శోషణను మెరుగుపరుస్తాయి.

*(వ్యాసరచయితలు: కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్తలు)*

■

# పుష్ప విలాపం!



*బంతి పూలకు కనీస ధర కూడా లేకపోవడంతో ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రైతులు కోయకుండా తోటపైనే వదిలేస్తున్నారు. రెండు వారాలుగా పూలను కోసి మార్కెట్‌కు తరలిస్తున్నా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో బస్తాను వంద రూపాయలకే కట్టబెట్టి వచ్చేస్తు న్నారు. కొన్న ధరలకు ట్రాన్స్‌పోర్టు అదనం కావడంతో ఆ నష్టాలు తమకెందుకని పూలను స్థానిక వ్యాపారులు కూడా కొనడం మానేశారు. కొందరేమో పూలను గుంటూరు మార్కెట్‌కు తరలించినా అక్కడా కొనేవారు ముందుకు రాక పోవడంతో పూలను గుంటూరు హైవే పక్కన పడేసి వెనుదిరుగుతున్నారు.*

*వి.కోట పూల మార్కెట్‌లో 40 కిలోల బస్తా కేవలం వంద మాత్రమే పలికింది. మధ్యాహ్నం 12 గంటలకైతే కొనేవారే ముందుకు రాకపోవడంతో పూలను తెచ్చిన రైతులు ట్రాక్టర్ పూల లోడును పట్టణంలోని డంపింగ్ యార్డులో పడేసి వెనుదిరిగారు. మరికొందరు దేవాలయాల వద్ద పడేసి వెళ్ళారు. మద్దిమాకులపల్లెకు చెందిన వెంకటరమణ రెండెకరాల్లో పూల సాగు చేసి, కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కోతకొచ్చిన తోటకు రోటరి వేసేశారు. ఎకరా పూలసాగుకు రూ.70 వేల దాకా ఖర్చవుతోంది. కిలో బంతి పూలు రూ.20 పలికితేనే పెట్టుబడులు తిరిగొస్తాయని, అలాంటిది కొనుగోలే లేకపోతే తమ గతి ఏం కావాలని రైతులు వాపోతున్నారు.*

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

ప్రశాంతమైన మనస్సులోనే మంచి ఆలోచనలు పుడతాయి, మనస్సు మలినమైతే ఆలోచనా మలినమే

# ప్లాస్టిక్ డ్రమ్ముల్లో డ్రాగన్ మొక్కల పెంపకం!

ఉపాయం ఉండాలే గాని ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఉత్సాహంగా మరో వృత్తిని చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చనటానికి కేరళకు చెందిన ఓ విశ్రాంత ఉపాధ్యాయిని కృషే నిదర్శనం. కొల్లం పట్టణానికి చెందిన రెమాభాయ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి రెండేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత మట్టితో పని లేని వ్యవసాయ (సాయిల్ లెస్) పద్ధతిలో తమ ఇంటిపైనే డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయటం ప్రారంభించారు.



ప్లాస్టిక్ డ్రమ్ముల్లో హైడ్రోపోనిక్ పద్ధతిలో డ్రాగన్ పండ్లను సాగుచేస్తున్నారు. నెలకు 500 కిలోల డ్రాగన్ ఫ్రూట్స్ దిగుబడి వస్తోంది. కిలో రూ. 200కు విక్రయిస్తూ నెలకు రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు. ఏడాదికి 3 నెలలే డ్రాగన్ ఫ్రూట్ సీజన్ ఉంటుంది.

రిటైరైన కొద్ది రోజులకే ఆమె తల్లి వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆ వేదనలో నుంచి బయటపడటం కోసం ఏదైనా వ్యాపకం పెట్టుకోవాలనుకున్నారు. విదేశీ పండైన డ్రాగన్ సాగును ఇంటిపైనే ప్రారంభించారామె. నేల పైన పెంచ డానికి ఇంటి దగ్గర ఖాళీ స్థలం లేదు. అందుకే మేడపై రెండొందల లీటర్ల డ్రమ్ములు 50 పెట్టి, వాటిల్లో వంద డ్రాగన్ మొక్కల్ని పెంచుతున్నారు. మట్టి మోసుకెళ్లి ఇంటిపైన పెట్టటం నాకు కష్టం అనిపించి సాయిల్ లెస్ పద్ధతిని ఎంచుకున్నానని రమాభాయ్ అంటున్నారు. కొన్ని ఎరుపు, కొన్ని పసుపు రకం డ్రాగన్ మొక్కలను నాటారు.

ఎక్కువైన నీరు బయటకు పోవటానికి డ్రమ్ముకు అడుగున బెజ్జం పెట్టారు. ఆకులు, రంపపు పొడి, వరి గడ్డి ముక్కలు, బ్యారెల్‌కు 3 కిలోల చొప్పున కంపోస్టు ఎరువును డ్రమ్ములో దొంతర్లుగా వేశారు. వంద గ్రాముల బోన్ మీల్ కూడా కలిపి, మొక్కలు నాటారు.

ఎండు ఆకులు, కూరగాయ వ్యర్థాలు, చేపలు, రొయ్యల వ్యర్థాలు, ఆల్చిప్పలతో సొంతంగా తయారు చేసుకునే ద్రవరూప ఎరువు లను మొక్కలకు ఆమె అప్పుడప్పుడూ ఇస్తున్నారు.

దీంతో మొక్కలు పోషక లోపాలు లేకుండా ఆరోగ్యంగా పెరిగి, మంచి దిగుబడిని ఇస్తున్నా యని రమాభాయ్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

**సేంద్రియ ద్రావణం**

‘ఏదైనా కంటెయినర్‌లో కిలో చేపలు, రొయ్యలు, పీతల డొప్పలకు కిలో బెల్లంతో పాటు బొప్పాయి పండ్ల తొక్కలు కలపాలి. ఎండ తగలకుండా నీడన ఉంచి అప్పుడప్పుడూ కలియదిప్పుతూ ఉంటే.. 90 రోజులకు సేంద్రియ ద్రావణం సిద్ధమవుతుంది. ఇది కాల్షియం, ఫాస్ఫరస్‌ను పుష్కలంగా అందిస్తుంది. ఆ బలంతో డ్రాగన్ మొక్కలు చక్కగా కాస్తున్నాయి’ అన్నారు రమాభాయ్.

జెసిస్ వరల్డ్ పేరిట యూట్యూబ్ ఛానల్‌ను కూడా ఆమె ప్రారంభించారు. సీజన్‌లో మా ఇంటిపైన 200–300 డ్రాగన్ పూలు కనువిందు చేస్తుంటే నా వయసు 60 నుంచి 20కి తగ్గిపోతుంది. బాధలన్నీ మర్చిపోతున్నా అంటున్నారామె సంతోషంగా! ■

నీ బలహీనతలు గ్రహిస్తే బలవంతుడివి, లోపాలు గ్రహిస్తే సమర్థుడివి, గుణపాఠం నేర్చుకుంటే వివేకివి

# జనం మరచిన ఆకుకూరలకు మళ్లీ జీవం!

**ఒక** ఎకరం విస్తీర్ణంలో రకరకాల దేశీ, విదేశీ ఆకుకూరలు సాగు చేస్తున్నారు రైతు పిట్టల శ్రీశైలం. హైదరాబాద్‌కు దగ్గరలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లోని తనకున్న ఎకరం వ్యవసాయ భూమిలో సరికొత్త ఆలోచనలతో పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. కుళ్లిపోయిన కూరగాయలతో ఎరువులు తయారు చేసుకుని, సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం



చేస్తున్నారు. రకరకాల ఆకుకూరలు పండిస్తుండటంతో స్థానికులతో పాటు హైదరాబాద్ నగర వాసులు కూడా పొలం వద్దకే వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు.

రైతు శ్రీశైలం సాగు చేస్తున్న ఉత్పత్తులలో 30 స్వదేశీ, 10 విదేశీ రకాల ఆకుకూరలు ఉన్నాయి. విదేశీలో బోక్చాయి, ఐస్‌బర్గ్, ఎర్ర గోంగూర, బ్రెజిల్ పాలకూర వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. స్వదేశీకి చెందినవి కొత్తిమీర, పాలకూర, చుక్కకూర, తోటకూర, ఎర్రతోటకూర, గోంగూర, పొన్నగంటికూర, కొయిగూర, గంగవాయిలి కూర, మెంతి, పులిచేరు, గలిజేరు, బంకోంటి కూర, తూటి కూర, తుమ్మి, కొండపిండి కూర, కోడిజుట్టు కూర, గునుగు ఆకు, తీగ బచ్చలి, సిలోన్ బచ్చలి, గ్రీన్ బచ్చలి వంటి పలు రకాలు ఇందులో ఉన్నాయి.

**సేంద్రీయం వైపే :** ప్రస్తుతం చాలామంది సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల స్థానంలో సేంద్రీయ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ వ్యవసాయంలో రసాయన ఎరువులు, కీటక నాశనుల వినియోగం చాలా ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా వ్యవసాయ అవసరాల కోసం ఎక్కువగా బయటి వనరులపై ఆధారపడటం, పనిముట్లు, యంత్రాల వినియోగం, వ్యయం అధికం కావడం లాంటి సమస్యలు ఉన్నాయి. ఇవేకాకుండా ఫెర్టిలైజర్స్ వాడకంతో పర్యావరణం, జీవవైవిధ్యం, నేల నాణ్యతపై అత్యంత ప్రతికూల ప్రభావం పడుతోంది.

సంప్రదాయ వ్యవసాయంలో వాడిన పద్ధతులు ఈ సేంద్రీయ వ్యవసాయంలో చాలా తక్కువ స్థాయిలో ఉంటాయి. వీటి స్థానంలో సహజమైన వాటిని వాడతారు. సహజ ఎరువులు, కీటక నాశనులను పంట మొక్కలకు అందిస్తారు.

సహజ ఎరువులలో పంట వ్యర్థాలు, పశువుల నుంచి వచ్చే మలమూత్రాలు మొదలైనవి. వీటివల్ల ఆరోగ్యవంతమైన ఆవరణ వ్యవస్థను పెంపొందడంతో పాటు, సారవంతమైన మృత్తికలకు (భూమి) రక్షణ కల్పించవచ్చు. సహజ కీటక నాశని వ్యవస్థ కలిగిన పద్ధతుల ద్వారా చీడపీడలను సమర్థవంతంగా అరికడతారు.

సేంద్రీయ వ్యవసాయంలో ఎక్కువగా కూలీలు అవసరమవుతారు. అంతేకాకుండా కొన్ని రకాల పంటల ఉత్పత్తికి కాస్త ఎక్కువ సమయం కావాలి. ఇవి సేంద్రీయ సాగులో ప్రస్తుతం ప్రతికూల అంశాలు. అయితే ఈ పద్ధతుల ద్వారా నేల స్వభావాన్ని, జీవవైవిధ్యాన్ని మెరుగుపరిచడం ద్వారా సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చు.

ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న భారత ప్రభుత్వం సేంద్రియ సాగును ఎంతగానో ప్రోత్సహించడానికి సహకారం అందిస్తోంది. రైతులు, ప్రకృతి, మానవ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది.

■

మేలు చేసిన వారిని మరువకు, ప్రేమించే వారిని ద్వేషించకు, నమ్మిన వారిని వంచించకు

# వచ్చేస్తోంది ... రిమోట్ వ్యవసాయం !

వ్యవసాయంలో ఎలక్ట్రిక్ వాహనాలు, రిమోట్ యంత్రాలు.. కూరగాయలు, పండ్ల తోటల రైతులకు లాభ దాయక సౌరకుటీరం.. చిరుధాన్యాలతో రుచికర బియ్యం.. ఇలా అనేక నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ లోని జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ సంస్థ (నార్మ్) వేదికైంది. సుస్థిర వ్యవసాయ అంకురాల నిర్మాణంపై ఇటీవల ఇక్కడ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన వ్యవసాయానికి సంబంధించి వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలను ఆయా అంకుర సంస్థల వ్యవస్థాపకులు ఆవిష్కరించారు.



**చిరుధాన్యాల బియ్యం**

చిరుధాన్యాల సాగు ఇటీవల కాలంలో పెరుగుతోంది. వాటి వినియోగం మాత్రం ఇంకా ఆ స్థాయికి చేరలేదు. ప్రజలు వరి బియ్యానికే మొగ్గుచూపుతున్నారు. వారిని చిరుధాన్యాల వైపు ఆకర్షించేందుకు హైదరాబాద్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) కొత్త మార్గం కనిపెట్టింది.

జొన్నలు, సజ్జలు, కొర్రలు ఇతర చిరుధాన్యాలను శుద్ధి చేసి 'ఎనలాగ్ రైస్' తయారుచేస్తోంది. దీనికోసం ఎక్స్‌ట్రూడర్ అనే యంత్రాన్ని తయారుచేసింది. వీటిని అన్నంలా వండుకోవచ్చని, వినియోగదారులు ఆదరిస్తున్నా రని ఐఐఎంఆర్ న్యూట్రిహబ్ ప్రతినిధి శ్రీజ తెలిపారు.

**ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, యంత్రాలు**

వ్యవసాయ యాంత్రీకరణలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొచ్చేందుకు బెంగళూరుకు చెందిన బుల్‌వర్క్ మొబిలిటీ సంస్థ కృషి చేస్తోంది. ఇప్పటికే ట్రాక్టర్, కలుపు తీసే యంత్రాలతోపాటు అనేక పరికరాలను తయారు చేసింది. రూ.10 లక్షల విలువ చేసే ఈ ట్రాక్టరును రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే ఆరు గంటలపాటు నడుస్తుంది. పనులు చేస్తున్నప్పుడు పొలం మధ్యలో ఆగిపోకుండా పోర్టబుల్ ఛార్జర్‌నూ అంతరంగా అమర్చారు. రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీకి ముందుకొస్తే రైతులకు తక్కువ ధరకు వీటిని విక్రయిస్తామని కంపెనీ ప్రతినిధి గుణశ్రీ జయప్ప తెలిపారు.

**కలుపుతీసే యంత్రం ...**

రిమోట్ కంట్రోల్ ద్వారా కలుపు తీయొచ్చంటున్నారు ఏపీఎస్ఐ అంకుర సంస్థ వ్యవస్థాపకులు అభిషేక్ శవరణన్, కార్తీక్‌లు. రైతులు పొలం గట్టునే కూర్చొని కలుపు తీసేలా ఫార్మేట్ యంత్రాన్ని వీరు రూపొందిం చారు. ఇది రిమోట్ కంట్రోల్ సాయంతో పని చేస్తుంది. దీని వల్ల రైతులకు శ్రమ, కూలి ఖర్చు తగ్గుతాయని చెబుతున్నారు.

**పాతకాలం వరుగులు.. ఆధునిక పద్ధతిలో**

కూరగాయలు, పండ్లు త్వరగా పాడవడంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెలంగాణలో ఒకప్పుడు వరుగుల పేరిట ఎండబెట్టి వాడుకునే విధానం ఉండేది. ప్రస్తుతం ఎయిర్‌ఫ్రై తదితర ఆధునిక విధానాలు ఉన్నప్పటికీ.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన పీక్వరెల్ సంస్థ సౌరశక్తి ద్వారా ఎండబెట్టే అడ్వాన్స్‌డ్ అడాప్టబుల్ అగ్రికల్చర్ సపోర్ట్ (ఏ3ఎస్) పరికరాన్ని రూపొందించింది. ఇదో సౌరకుటీరం లాంటిది.

ఇందులోని ర్యాకుల్లో కూరగాయలు, పండ్ల ముక్కలు ఉంచి అధిక ఉష్ణోగ్రత ప్రసరింప జేస్తే గట్టిపడతాయి. సౌరశక్తి వినియోగంవల్ల వాటి సహజ రుచి కోల్పోవని సంస్థకు చెందిన సందీప్, కిరణ్ చెబుతున్నారు. రైతులు ముందుకొస్తే ఈ యంత్రాలను అమర్చి ఇస్తామంటున్నారు. ■

**నీవు మోసే బరువు కంటె ఆ బరువును నీవు మోసే తీరే నిన్ను ఎక్కువగా కుంగదీస్తుంది**

# ఐదారేళ్లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల హవా!

**చెలిమి చేస్తే ప్రకృతి అంత గొప్పది లేదు. పూర్వీకులు ప్రకృతితో మమేకం కాబట్టి నిండు నూరేళ్లు పరిపూర్ణ జీవితాన్ని అనుభవించారు. ఇప్పుడు మనం తినేది అసహజమైన తిండే. అందుకే రోగాలు పలకరిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే జనంలో ఆలోచన మొదలయ్యింది. కోస్గిలో ప్రకృతి వ్యవసాయ కార్యశాలలో చర్చ చూస్తే ఇది అర్థమవుతుంది.**

సేంద్రియ వ్యవసాయంతో ఖర్చులు తగ్గుతాయి. నేలను ఆరోగ్యవంతం చేసేందుకు సేంద్రియ ఎరువు మొక్కలు పెంచడం ఎంతో అవసరం. కానీ రైతులు అధిక దిగుబడుల కోసం ఎరువులు క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడుతుండడంతో నేలలోని అనంతకోటి సూక్ష్మజీవులకి ప్రశ్నార్థకరంగా మారింది. పంట నుంచి వచ్చే దిగుబడులు విషతుల్యమై మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి వ్యవసాయం చేసిన పలువురు రైతుల అభిప్రాయాలు చూద్దాం.

**విశేషాలు :**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 589 ఎకరాల్లో ప్రకృతి సేద్యంతో పంటలను పండిస్తున్నారు. ప్రకృతి సేద్యంలో ఏకకాలంలో ప్రధాన పంటలతో పాటు అంతర పంటలను కూడా సాగు చేసుకోవచ్చు. అంతర పంటలు పూర్తయ్యాక వ్యర్థాలను నేలలో కలియదున్నటం వల్ల ఎరువును కూడా సహజంగానే పొందవచ్చు. ఆవు పేడతో తయారుచేసే జీవామృతాన్ని సాగునీటితో పంటల వరుసల మధ్య, మొక్కల నడుము, పెరిగిన పంటలపై పిచికారీ చేయవచ్చు. ప్రస్తుతం పంటలకు వాడుతున్న నీటిలో కేవలం 10 శాతం నీటితో ప్రకృతి సేద్యం చేయవచ్చు. భూమిలో కర్బన శాతం 2.5కు పెరుగుతుంది.

ఈ పంటల సాగులో మొదటి మూడేళ్లకు ఓ మోస్తరు దిగుబడులు వస్తాయి. ఆ తర్వాత పుంజుకుంటాయి. కాని మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో మంచి ధరలు పలుకుతున్నాయి. ఐదారేళ్లలో ప్రకృతి ఉత్పత్తుల హవా ఉంటుందని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి బి. వెంకటేశ్ అన్నారు.

**మార్కెట్ సృష్టించుకోవాలి**

మాది ఏపీలోని సత్యసాయి జిల్లా ధర్మవరం. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదని కుర్చీలు, మంచాల వ్యాపారం చేసే వాడిని. ప్రకృతి ఉత్పత్తులకు మంచి గిరాకీ వస్తోందని తెలుసుకుని 2011 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. 7 ఎకరాలలో వరి, వేరుశనగ, బత్తాయి, బొప్పాయి, ఆకుకూరల సాగు చేపట్టాను. నాలుగు నెలలకు రూ. 3 లక్షల వరకు సంపాదిస్తున్నాను. నేను పండించిన ఉత్పత్తులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్‌వంటి నగరాలకు సరఫరా చేసి విక్రయిస్తున్నాను. ముందుగానే అక్కడి వ్యాపారంతో అవగాహనకు వచ్చాను. మార్కెటింగ్ వ్యవస్థ సృష్టించుకున్న తరువాత సేంద్రియ సాగులోకి దిగితే ఉపయోగం ఉంటుంది.

**– నాగరాజు, రైతు, ధర్మవరం**

**ఆరోగ్య ఆహార కుటుంబం**

నేను హైదరాబాద్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. మనం తింటున్న తిండిలో బలం ఉండటం లేదు. ఏ వస్తువు చూసినా కలుషితమే. సహజంగా పండే తిండి తినాలంటే మనమే పండించుకుంటే బాగుటుందని భావించాను. వ్యవసాయంపై మక్కువతో ఇంటికి వచ్చేశాను. వర్క్ ఫ్రం హోం మొదలుపెట్టాను. ఎకరం భూమిలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం

**కుంగిపోతే కష్టం రెట్టింపవుతుంది, నవ్వగలిగితే నలుసంతగా తేలిపోతుంది**

మొదలు పెట్టాను. మొదట మా కుటుంబం వరకు అవసరమయ్యే పంట ఉత్పతుత్ల వరకే సాగు చేశాను. అవి తినడం వల్ల ఆరోగ్యంగా ఉన్నాం. ఉత్పత్తుల దిగుబడి మరింత పెంచి అమ్ముదామని ప్రణాళిక రూపొందించాను. మన తాతలు విత్తనాలు బయట కొనుగోలు చేయకుండా విత్తనాన్ని శుద్ధి చేసుకుని పంటలను పండించేవారు. వాటిలో అధిక పోషకాలు ఉండేవి.

**– రాజేశ్వర్‌రెడ్డి, అప్పనపల్లి, మహబూబ్‌నగర్**

**గోవు ఉంటే అన్నీ ఉన్నట్లే**

**మ**న దేశంలో గోవును దైవం, అమ్మతో పోలుస్తున్నారంటే ఎంత ప్రాధాన్యం ఉందో గమనించవచ్చు. ఇంటికి ఒక దేశీయ గోవు ఉండాలి. భూమిలో పంటల సాగుకు కావాల్సిన అన్ని పోషకాలు లభ్యంకాని రూపంలో ఉంటాయి. ఆవుపేడ, గోమూత్రం చల్లితే పోషకాలు వెలికి వస్తాయి. నేను 5 ఎకరాలలో నాలుగేళ్ళుగా వరి, కూరగాయలు సేంద్రియ పద్ధతిలో పండిస్తూ హైదరాబాద్‌లో శిరిడిసాయి సేవా ట్రస్ట్ సహకారంతో మార్కెటింగ్ చేస్తున్నాను. నెలకు రూ. 25 నుంచి 30 వేల వరకు సంపాదిస్తున్నాను. నాకు ఏదైనా సలహాలు, సందేహాలుంటే అంతర్జాలంలో శోధించి తెలుసుకుంటున్నాను. నిపుణులను సంప్రదిస్తున్నాను.

**– రామకృష్ణ, పోతిరెడ్డిపల్లి**

**యువత రావాలి.. పరిస్థితి మారాలి**

**నా** చిన్నప్పుడు ప్రకృతి వ్యవసాయమే చేసేవాళ్లు. కాలక్రమేణా అధిక దిగుబడులకు ఆశించి రసాయన ఎరువుల వాడకం పెరిగింది. దీంతో అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. మా గ్రామంలో ఓ యువకుడు ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తుండడం చూసి నేను రెండేళ్ల నుంచి అనుకరిస్తూ వరి, కూరగాయల సాగు చేస్తున్నాను. 2 ఎకరాలకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. రూ. 1.50 వేలు వస్తోంది. ఎక్కడికో వెళ్లి అరకొర జీతానికి పని చేసే బదులు యువత ప్రకృతి వ్యవసాయంలోకి రావాలి. పరిస్థితులను మార్చాలి.

**– ఎన్. మోహన్‌రెడ్డి, పోతిరెడ్డిపల్లి**

■

## నేను రైతును ....
## నా రాత మారింది !

– డా॥ రాధశ్రీ

**మా** *ముత్తాత ఎగసాయం చేసేటప్పుడు...*
*"తెల్లదొరలు పోతున్నారు...*
*మన రాతలు మారుతున్నాయి"*
*...అంటూ సంబరపడి "పోయాడు"*
*ఆయన అన్నట్లే నల్లదొరలొచ్చారు*
*కానీ, రాత మారలే!! ....*
**మా** *తాత "పొలం"బోతూ...*
*పంచవర్ష ప్రణాళికలు, సాగరు డ్యాం,*
*పోచంపాడు, ఎద్దులకు ఎగసాయానికి నీళ్ళే నీళ్ళు*
*...అంటూ అంతులేని సంతోషంతో "పోయాడు"...*
*రాత మారలే!! ....*
**మా** *నాయన 'బావికాడి'కి వెళుతూ...*
*హరిత విప్లవం, జైకిసాన్, రైతు సంఘాలు,*
*నీటి సంఘాలు, విత్తనాలు, గిడ్డంగులు,*
*కోపరేటివ్ బ్యాంకులు...*
*అరచేతిలో నేతలు చూపించిన*
*వైకుంఠానికి "పోయాడు"*
*రాత మారలే !! మారనే .... మారలే!!*
**నా** *కాలంలో ... ఈ కాలంలో...*
*రైతుబంధు, రైతు భరోసా, కిసాన్ కార్డు, కిసాన్*
*సమ్మాన్ నిధి, మద్దతు ధర, అంటూ ఊదరగొట్టి*
*నేతలు చీదర చేస్తున్నారు ....*
***అందుకే నా రాత, నా నేత రాత కూడా మారింది!!***
**మా** *నేత ఎదిగే ఎదిగే ఏడంతస్తుల మేడలో*
*నేను మాత్రం దిగే, దిగే, దరిద్రదేవత నీడలో*
*పెళ్ళాం పిల్లలతో సహా ఒదిగే, ఒదిగే, ఒదిగే '*
*మాడ'లు లేక మాడిపోయిన 'శని'గాడి వాడలో*
*ఇంకా చెప్పాలంటే... మురికిపోని, పూరి గుడిసెలో!!*
***నేను రైతును ! తెలివిలేని పల్లెటూరి బైతును!!***

■

**అద్భుతాలు, అందాలు కళ్ళు చూడగలిగేవో, స్పర్శకు తెలిసేవో కావు;మనసుతో అనుభవించవలసినవే!**

# ప్రకృతి వ్యవసాయంలో రెండు గ్రామాలు

**అం**దరూ చిన్న, సన్నకారు రైతులే. దిగుబడులు రాలేదని దిగాలుగా కూర్చోలేదు. ప్రస్తుత పరిస్థితులను అధిగమిస్తూ.. వినూత్న పంథా ఎంచుకుని విశేషంగా రాణిస్తున్నారు. సేంద్రీయ ఎరువులతో ఏడాది పొడవునా ఆరోగ్యకర పంటలు పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు, రైతులు వచ్చి పంటలను పరిశీలించి.. అధ్యయనం చేస్తున్నారు. విభిన్న సాగు విధానాలు తెలుసుకొని మెచ్చుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వంద శాతం ప్రకృతి వ్యవసాయంతో ప్రగతి పథంలో సాగుతూ ఆదర్శబాటలో పయనిస్తున్న రెండు గ్రామాలు ఇవి .. అక్కడి సాగు విశేషాలు తెలుసుకుందాం.

**కుం**దుర్పి మండలం తమ్మయ్యదొడ్డి గ్రామంలో సుమారు 53 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 250 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 47 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సామూహిక ప్రకృతి వ్యవసాయం (ఏపీజీఎన్ఎఫ్) పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలోనే ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేశారు. ఇక్కడ ఐదు అంచెల్లో పంటలు పండిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు.

ఐదు అంచెలు అంటే.. పెద్ద, చిన్న, దాని కంటే చిన్న ఇలా రకరకాల ఎత్తులో ఉద్యాన మొక్కలను నాటి.. వాటి మధ్యలో అంతర పంటలు సాగు చేయడం. ఖరీఫ్ సీజన్‌లో మామిడి, నేరేడు, ఉసిరి, కంది, వేరుసెనగ, ఆముదం తదితరాలు నాటుకుని సంవత్సరం అంతా పండించే విధానం. ఇందుకు ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సహించింది.

ప్రస్తుతం 'ఏటీఎం' పేరుతో అర ఎకరాలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇంటి అవసరాలకుపోనూ మిగిలినవి మార్కెట్కు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు తమలపాకు, వరి, రాగి, జొన్న, సజ్జలు, కూరగాయలు తదితర పంటలు పండిస్తున్నారు.

**మ**డకశిర మండలం ఉగ్రేపల్లి గ్రామంలో 82 కుటుంబాలు ఉన్నాయి. 126 మంది రైతులు 180 ఎకరాల్లో వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వర్షాధారంగా రాగి, వేరుసెనగ, మామిడి, మొక్కజొన్న, పూలతోటలు, బెండ, ఆకుకూరలు, వంకాయ, టమాటా, ముల్లంగి, క్యారెట్ తదితర పంటలు పండిస్తున్నారు. మార్కెట్లో కూరగాయలకు డిమాండ్ ఉంది. ప్రకృతి వ్యవసాయం చేసినప్పటి నుంచి భూములు సారవంతంగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు.

### ప్రతినెలా తమలపాకులతో ఆదాయం

*– చంద్రశేఖర్, రైతు*

**ఐ**దెకరాల్లో బోరు కింద నాలుగు రకాల పంటలు సాగు చేస్తున్నా. 1.50 ఎకరాల్లో తమలపాకు, వక్క, రెండు ఎకరాల్లో టమాటా.. 1.50 ఎకరాల్లో మామిడి చెట్లు పెట్టుకున్నా. చెరువు మట్టి, జీవామృతం, కషాయాలు వేసుకుని పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. కూలీలు, కషాయాలు తదితరాలకు ఏడాదికి రూ.2లక్షల వరకు పెట్టుబడి వస్తుంది. తమలపాకులోనే నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది.

### వర్షాధారంగా ..

*– నీలమ్మ, రైతు*

**మొ**త్తం 2.50 ఎకరాల పొలం ఉంది. వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్నా. ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది మామిడి, ఉసిరి, పనస, చింత మొక్కలు ఇచ్చారు. వాటి మధ్యలో వేరుసెనగ, కంది, పెసర సాగు చేస్తున్నా. ఏడాది పొడవునా ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూనే సాగులో విభిన్న పద్ధతులు నేర్పుతోంది. ■

**నిన్ను ప్రేమించే వారిని ప్రేమించు, బాధించిన వారిని క్షమించు, నీ అవసరం వున్న వారికి సహాయపడు**

# 'వాష్' పై పెద్దపల్లి జిల్లాస్థాయి కార్యశాల

– రాజోజుల బ్రహ్మాచారి

తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలో క్రిందటి అక్టోబర్ నెలలో 'నీరు,పారిశుధ్యం పరిశుభ్రత' (వాష్)పై జిల్లా స్థాయి కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీ ఆర్. రవీందర్, జిల్లా ఉప వైద్యాధికారి శ్రీమతి అన్నప్రసన్న, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ జె.రవి కుమార్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి ఇందిర, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీ ప్రకాష్, శ్రీ మోహన్, శ్రీ కెనెడి,



ఏపిమాస్ తెలంగాణా వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారి, జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్ పాల్గొన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది

శ్రీ బ్రహ్మాచారి నీరు పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) జిల్లా స్థాయి కార్యశాల ఉద్దేశము, ఎజెండా, నీటి సంక్షోభం, ఏపిమాస్ 23 సంవత్సరాల సుదీర్ఘ అనుభవాలు, లక్ష్యాలు, సంస్థ విలువలు, చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.

ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలోని 4 మునిసిపాలిటీలలో సుమారుగా 183 మంది ఆర్.పి లకు వాష్‌పై అవగాహన కల్పించడం జరిగిందని, ఇప్పటివరకు 5298 వాష్ రుణాలను సమీకరించి 5.26 కోట్ల మూలధనాన్ని వాష్ అవసరాలకోసం వాడుకునేటట్లు చేయడం జరిగిందని, జరిగిన కార్యకలపాలను, చేపట్టబోయే కార్యక్రమాలు అయిన సామజిక నీటి శుద్ధి ప్లాంట్ / కమ్యూనిటీ టాయిలెట్స్ గురించి వివరించారు. మరియు ఎవరైతే సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారో వారికీ సబ్సిడీ రూపేణ రెండు లక్షల వరకు మహిళా అభివృద్ధి సొసైటీ అందిస్తుందని చెప్పారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.రవీందర్ మాట్లాడుతూ నీరు పారిశుధ్యము, పరిశుభ్రత (వాష్) ప్రాముఖ్యతను అన్ని సంఘాలలో అందరికి వివరించాలని, యిది జరగా లంటే మండల స్థాయిలో వి ఓ ఏ లకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంతేకాకుండా, న్రీరు, పారిశుధ్యము, పరిశుభ్రత అజెండా అంశాలను ప్రతి సంఘం / గ్రామసంఘం /సమాఖ్యలు / పట్టణ సమాఖ్యలు / మండల సమాఖ్యలు / జిల్లా సమాఖ్యల సమావేశాలలో ఎప్పటికప్పుడు చేర్చించాలని చెప్పారు

తర్వాత జిల్లా ఉప వైద్యాధికారి శ్రీమతి అన్నప్రసన్న మాట్లాడుతూ ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని, నీటి నిల్వ వల్ల దోమలు పెరుగుతాయని, దోమకాటు వల్ల డెంగ్యు, మలేరియా, చికెన్ గున్యా లాంటి రోగాలకు గురికావడం జరుగుతుందని, అందువల్ల వాతావరణన్ని పొడిగా ఉంచుకోవాలని మరుగుదొడ్డి, మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

నీ ఆకాంక్ష ఎంత బలీయంగా వుంటుందనేదే నీ అదృష్టాన్ని నిర్ణయిస్తుంది



వాష్‌పై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టి పని చేయాలని కోరారు. ఈ సీజన్లో విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కావున ప్రతి ఒక్కరు సమతుల ఆహారం తీసుకోవాలని, రక్తహీనతకు గురి కాకుండా చూసుకోవాలని, ఏమైనా అనారోగ్య సమస్యలు వుంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని ఆమె కోరారు. చెప్పారు.

చివరగా ఏపిమాస్ మెదక్ జిల్లా సమన్వయకర్త, శ్రీ మైత్రి ప్రవీణ్ మాట్లాడుతూ నీరు పారిశుధ్యము మరియు పరిశుభ్రత (వాష్)పై జిల్లా స్థాయి కార్యశాల నిర్వహించటం కోసం సంప్రదించగానే స్పందించి వెంటనే అనుమతిని ఇచ్చిన జిల్లా అడిషనల్ కలెక్టర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి, జిల్లా ఉప వైద్యాధికారి గారికి, సెర్ప్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి, డిఆర్‌డిఏ జిల్లా ప్రాజెక్ట్ అధికారులకు, మెప్మా డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్‌కు, మెప్మా అడిషనల్ డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్‌కు, కార్యక్రమంలో పాల్గొన్న సెర్ప్, మెప్మా సిబ్బంది అందరికీ ధన్యవాదములు తెలిపారు. భవిష్యత్తులో ఏపిమాస్ – వాష్ కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా అమలు పరచటంలో సెర్ప్, మెప్మా సంస్థల సహకారమిలాగే కొనసాగాలని ఆశిస్తున్నామని తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు. ■



సరైన ఆలోచనతో ముందడుగువేస్తే సమస్యలే అవకాశాలుగా అందివస్తాయి

# పెట్టుబడిని రెట్టింపుచేసే కిసాన్ వికాస్ పత్ర్!

**కేం**ద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం వివిధ రకాల సేవింగ్ స్కీమ్స్ అందుబాటులోకి తెచ్చింది. అన్ని వర్గాల ప్రజల అవసరాల కోసం పొదుపు పథకాలను ప్రారంభించింది. అయితే వీటిలో ఒక స్మాల్ సేవింగ్స్ సర్టిఫికేట్ స్కీమ్ చాలామందిని ఆకర్షిస్తోంది. ఎందుకంటే ఇది నిర్దిష్ట కాలంలో పెట్టిన పెట్టుబడిని డబుల్ చేస్తుంది. అదే కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)పథకం.

ఈ పథకంలో మినిమమ్ డిపాజిట్ చాలా తక్కువ. ఎవరైనా ఇందులో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇండియా పోస్ట్ ఈ పథకాన్ని 1988లో ప్రారంభించింది. ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టేలా ప్రజలను ప్రోత్సహించేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ స్కీమ్ ఇన్వెస్టర్లకు భారీ రాబడిని అందిస్తుంది. పెట్టుబడిదారులు రెండింతల లాభాలు అందుకోవచ్చు.

**స్కీమ్ వివరాలు :**

ఈ పథకంలో కనీసం రూ.1,000 పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడికి గరిష్ఠ పరిమితి అంటూ ఏమీ లేదు. ఎంత డబ్బులైనా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు.

కేవీపీ లాక్-ఇన్ పీరియడ్ 30 నెలలు లేదా 2 ఏళ్ల 6 నెలలు. ఈ అకౌంట్ 115 నెలల (9 ఏళ్ల 7 నెలల) తర్వాత పూర్తిఅవుతుంది. మధ్యలో విత్ డ్రా చేయడానికి అనుమతించరు. ఒకవేళ తీసుకుంటే పెనాల్టీలు పడతాయి లేదా వడ్డీ రేట్లు తగ్గుతాయి.

**నిబంధనలు:**

కిసాన్ వికాస్ పాత్ర పథకంలో రూ.50,000కు మించి పెట్టుబడి పెట్టాలనుకునేవారు తప్పనిసరిగా పాన్ కార్డు వివరాలు అందించాలి. రూ.10,00,000 లేదా అంతకన్నా ఎక్కువ డబ్బు పెట్టుబడి పెట్టాలనుకుంటే ఆదాయ ధ్రువ పత్రాలు (ఇన్‌కమ్ ప్రూఫ్) చూపించాలి. దేశంలోని ఆర్థిక వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఈ నియమం తీసుకొచ్చారు.

**మనీ డబుల్**

కిసాన్ వికాస్ పత్ర పథకంలో పెట్టిన డబ్బు మీద ప్రతి సంవత్సరం 7.5 శాతం వడ్డీ వస్తుంది. 9 ఏళ్ల 7 నెలల తర్వాత పెట్టిన పెట్టుబడి రెట్టింపు అవుతుంది.




ఉదాహరణకు, ఇప్పుడు ఈ పథకంలో రూ.5 లక్షలు పెడితే, 9 ఏళ్ల 7 నెలల తర్వాత రూ.10 లక్షలు వస్తాయి. అదేవిధంగా, రూ.25 లక్షలు పెడితే, రూ.50 లక్షలు అవుతాయి.

ఈ స్కీమ్ లో 18 సంవత్సరాలు నిండిన భారతీయులు మాత్రమే పెట్టుబడి పెట్టవచ్చు. పెద్దవారు తమ పిల్లల పేరు మీద కూడా ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు.

అయితే హిందూ అవిభక్త కుటుంబాలు లేదా విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ఈ పథకంలో పాల్గొనలేరు. ఈ స్కీమ్‌లో జంటగా కలిపి ఇన్వెస్ట్ చేస్తే ఇద్దరికీ ఒకే సర్టిఫికెట్ ఇస్తారు. ■

స్నేహమంటే వెనుకాడకుండా సహాయపడేది, అడగకుండానే ఇచ్చేది, అనంతమైన ప్రేమను పంచేది

# రూ.10 వేలు ...10 సంవత్సరాలు ... రూ.17 లక్షలు!

దేశంలో ఎన్ని పెట్టుబడి సాధనాలు పుట్టినా ఇప్పటికీ ప్రజల నుంచి భారీగా ఆదరణ పొందుతున్నాయి పోస్టాఫీసు పథకాలు. అయితే ఈ క్రమంలో ఎలా పెట్టుబడి పెడితే ఎంత లాభం వస్తుంది అన్న విషయాలు మాత్రం మనలో చాలా మందికి తెలియదు. ప్రస్తుతం చాలామంది మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్లతో పాటు ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నప్పటికీ.. పోస్టల్ పథకాల్లో మాత్రం నమ్మకాన్ని కోల్పోవటం లేదు.

ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా రూ.17 లక్షలు ఎలా పొందాలన్న విషయం గురించే. పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ఇతర పథకాల మాదిరిగానే సురక్షితమైనది, ప్రభుత్వ హామీని కలిగి ఉన్నది. కొద్దిగా రాబడి తక్కువగా వచ్చినప్పటికీ ఎక్కువ రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లకు ఇది అద్భుతమైన ఎంపిక. అయితే స్కీమ్ కింద నెలవారీ వాయిదా చెల్లింపులు క్రమం తప్పకుండా సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది. వాయిదా సకాలంలో చెల్లించకపోతే 1 శాతం జరిమానా కూడా విధించబడుతుంది. వరుసగా 4 వాయిదాలు చెల్లించకపోతే ఆటోమేటిక్‌గా ఆర్డీ మూసివేయబడుతుంది.

పోస్టల్ రికరింగ్ డిపాజిట్ స్కీమ్ మెచ్యూరిటీ వ్యవధి 5 ఏళ్లుగా ఉంది. అందువల్ల వరుసగా ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత వడ్డీతో పాటు అసలు తిరిగి చెల్లించబడుతుంది. ఎవరైనా వ్యక్తులు ఈ స్కీమ్ కింద కనీస పెట్టుబడి మొత్తం రూ.100 నుంచి ప్రారంభించవచ్చు. ఇందుకోసం ఖాతా తెరిచేందుకు ముందుగా సమీపంలోని పోస్టాఫీసులను సంప్రదించవచ్చు.

ప్రస్తుతం ప్రభుత్వం ఈ చిన్న పొదుపు పథకానికి 6.8 శాతం వడ్డీని ఆఫర్ చేస్తోంది. పోస్టల్ రికరింగ్ డిపాజిట్ ద్వారా రూ.17 లక్షలు సంపాదించటం ఎలా అనే విషయాన్ని పరిశీలిస్తే.. ఇందుకోసం పొదుపు ప్రారంభించే వ్యక్తులు నెలకు కనీసం రూ.10,000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అంటే రోజుకు సగటున రూ.333 పెట్టాలన్నమాట. ఇక్కడ ఐదేళ్ల పెట్టుబడిపై వడ్డీ రాబడితో కలిపితే మొత్తం రూ.7,17,827 మెచ్యూరిటీ మొత్తం అందుకుంటారు.

ఇప్పుడు దీనిని రూ.17 లక్షలుగా మార్చాలంటే.. పెట్టుబడిని మరో 5 సంవత్సరాల పాటు పొడిగించాల్సి ఉంటుంది. ఇలా చేస్తే 10 ఏళ్లలో పెట్టుబడి రూ.12 లక్షలు అవుతుంది. దీనిపై వడ్డీ రూ.5,18,546తో కలిపితే మెచ్యూరిటీ సొమ్ము రూ.17,18,546గా మారుతుంది. ఇలా స్థిరమైన రాబడిని కోరుకునే వ్యక్తులు రిస్క్ లేకుండానే చిన్న మొత్తాలను కూడబెడుతూ లక్షలు అందుకునేందుకు వీలు ఉంటుంది. ■

## ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కొక్క రైతుకు రూ. 20 వేలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు అందిస్తామన్నారు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు. శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అన్నదాత సుఖీభవ పథకంపై కీలక ప్రకటన చేశారు. ప్రతి ఏటా అర్హులైన రైతులందరికి రూ.20వేలు అందజేస్తామని.. ఇందులో పీఎం కిసాన్ రూ.6వేలు.. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి ఇస్తామని చెప్పారు. 41.4లక్షల మంది రైతులకు ఈ పథకం అందిస్తామని.. ఇందుకోసం ఇప్పటికే బడ్జెట్లో రూ.4,500 కోట్లు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ■

# ఎర్రచందనంతో ఎకరా పొలంలో రూ.10 కోట్లు !

ఎర్రచందనం చెట్లు ప్రపంచంలోనే చాలా అరుదైన జాతికి చెందినవని, వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని అధికారులు, నిపుణులు చెబుతున్నారు. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, లక్కమల, నల్లమల అడవులు తూర్పు కనుమల్లో ఉన్నాయి. వీటిలో ఎక్కువగా శేషాచలం, వెలుగొండల్లో మాత్రమే ఎర్రచందనం అధికంగా పెరుగుతుంది. ప్రధానంగా శేషాచలం కొండల్లో పెరిగే ఎర్ర చందనంలో ఎక్కువ చేవ ఉండడంతో దానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది అంటున్నారు నిర్వాహకులు.



ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. 'టెరో కార్పస్ సాంటలైనస్' అన్నది దీని శాస్త్రీయ నామం. టెరో అనే గ్రీకు మాటకు కర్ర అని అర్థం. ఎర్రచందనం కాయ చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. ఒకవేళ మొలకెత్తితే అది మొక్క రావాలంటే సంవత్సరం పడుతుంది. బంగారం కంటే విలువైన ఈ ఎర్రచందనం మొక్కలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నర్సరీలో విక్రయిస్తున్నారు. కేరళ నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నరసన్నపాలెం నర్సరీలోకి దిగుమతి చేసుకొని మొక్కలను వాటిని మూడు నుంచి నాలుగు నెలల వరకు సంరక్షించి ప్రత్యేకమైన ఎరువులు వాడి మొక్కని పెద్ద చేస్తున్నారు. అలా పెద్ద చేసిన తర్వాత మార్కెట్లోకి విక్రయిస్తున్నారు.

ఈ ఎర్రచందనం మొక్కల్ని ఇప్పుడు రైతులు కూడా పెంచవచ్చు అంటున్నారు నర్సరీ యజమానులు. కానీ వాళ్ల పంటలకు ఇంత క్వాలిటీ రాదు కానీ.. పెంచాలన్నా ఫారెస్ట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ల నుంచి పర్మిషన్ తీసుకోవాలి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ రైతులు పొలాల చుట్టూ ఈ ఎర్రచందనం మొక్కలు నాటుతున్నారు. అవి సాధారణంగానే పెరుగుతున్నాయి.

ఎర్రచందనం మొక్కలు వేయాలంటే కచ్చితంగా పాస్ బుక్, సర్వే నెంబర్‌తో ముందుగా ఎంఆర్‌ఓ ఆఫీస్‌లో, అలాగే ఫారెస్ట్ డిపార్ట్మెంట్లో అప్లికేషన్ పెట్టుకోవాలి. వాటిని సర్వే నెంబర్లు అన్ని కరెక్ట్‌గానే ఉన్నాయో లేవో చూసుకుని పర్మిషన్ ఇస్తుంటారు అధికారులు. అలా పంట పాస్ బుక్కుల మీద సర్వే నెంబర్లు మీద ఎర్రచందనం మొక్కల్ని పెంచుకోవచ్చని మోహన్ అనే నర్సరీ యజమాని తెలిపారు. ఎర్రచందనం మొక్కలు పంట రావాలంటే దాదాపుగా 15 సం॥ల వరకు వేచి ఉండాలి. రైతులు తమ భూమిలో 15 సం॥లు పాటు వేచి ఉండాలంటే కష్టం. 15 సంవత్సరాలపాటు రాబడి కూడా ఉండదు. కాబట్టి రైతులకు పంటపొలాల చుట్టూ ఎర్రచందనం మొక్కల్ని నాటి 15 సంవత్సరాల తర్వాత విక్రయిస్తున్నారు.

ఎర్రచందనం టన్ను నాలుగు లక్షల నుంచి 5 లక్షల వరకు పలుకుతుందని చెబుతున్నారు నర్సరీ యజమానులు. దీన్ని పెంచుకోవడానికి విరివిగా ప్రభుత్వం అనుమతిస్తే రైతులకు మంచి ఆదాయం వస్తుంది. ఎగుమతులు చేసుకోవచ్చు. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నరసన్న పాలెంలో నర్సరీలో కేరళనుంచి దిగుమతి చేసుకుంటున్నారు ఈ ఎర్రచందనం మొక్కల్ని 6 నెలల వరకు సంరక్షించి వాటిని రైతులకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క మొక్క 150 నుంచి 200 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

ఎకరా పొలంలో చుట్టూ ఈ చెట్లు నాటితే దాదాపు 40 మొక్కల వరకు అవసరం అవుతుంది. అదే ఎకరా పొలంలో పూర్తిగా ఎర్రచందనం మొక్కలు నాటాలి అంటే.. 400 మొక్కలు కావాలి. ఒక చెట్టు అర టన్ను వరకు బరువు వస్తుంది. ఎకరం పొలంలో చుట్టూ 40 మొక్కలు వేసినా రూ.కోటి వరకు రావొచ్చు. అదే 400 మొక్కలు నాటితే.. రూ.10 కోట్లు పొందే ఛాన్స్ ఉంటుంది. ■

# పంటవ్యర్థాలు తగలబెట్టే రైతులకు రెట్టింపు జరిమానా

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ – ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవమైన స్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కు పైనే నమోదవుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెడుతుండటంతో రాజధాని ప్రాంతంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలను సవరించింది. రూ.30 వేల వరకూ జరిమానాను పెంచింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది.

కేంద్ర నిబంధనల ప్రకారం.. రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.5 వేల జరిమానా విధించనున్నారు. రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న వారికి రూ.10 వేలు, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రూ.30 వేలు జరిమానా విధించనున్నారు.

కాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత 367గా నమోదైంది. ఆనంద్ విహార్, జహంగీర్‌పురి, అశోక్ విహార్, బావన, ముండ్కల్, రోహిని, సోనియా విహార్, వివేక్ విహార్, వాజీపూర్ … ఈ తొమ్మిది ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో ఉందని కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరి తీసుకోవడం ఇబ్బందికరంగా మారగా, మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగరవాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది.

**వరి కోతల తర్వాత అవశేషాలను కాల్చడం వల్ల జరిగే నష్టాలు**

1. పోషకాల నష్టం : నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయి, తద్వారా భవిష్యత్ పంటల కోసం అందుబాటులో ఉండవు.
2. వాయు కాలుష్యం : కాల్చడం వల్ల వాయుమాలిన్యం ఏర్పడి ఊపిరితిత్తుల సమస్యలకు దారి తీస్తుంది.
3. కీటకాల పెరుగుదల : తగలబడకుండా ఉన్న అవశేషాలు కీటకాలు మరియు వ్యాధులకు నివాసాలుగా మారతాయి.
4. నీటి నిల్వ తగ్గడం : కాల్చడం వల్ల మట్టిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్తు పంటలకు ఎక్కువ నీటి అవసరం ఉంటుంది.

వరి అవశేషాలను కాల్చకుండా పున:సంస్కరణలు చేసుకోవడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడేలా పర్యావరణ పరిరక్షణ ఉండేలా చేస్తుంది. ■

మనసుంటే మార్గముంటుంది, మనసు లేకుంటే సాకు సిద్ధంగా వుంటుంది

# కల్తీ కాలంలో కాసులు కురిపించే గానుగ నూనె!

ప్రస్తుతం కల్తీ కాలం రాజ్యమేలుతోంది. మార్కెట్లో లభించే అన్ని వస్తువులు కల్తీగా మారిపోతున్నాయి. ఉప్పు మొదలు పప్పు వరకు అన్నింటినీ కల్తీ చేస్తున్నారు కేటుగాళ్లు. దీంతో ఏం తినాలన్న భయపడే పరిస్థితి వచ్చింది. అటు రెస్టారెంట్స్‌లో నాణ్యత ఉండడం లేదు. పోనీ ఇంట్లోనే వంట చేసుకొని తిందామా? అంటే కల్తీలతో భయపడే పరిస్థితి ఉంది. ముఖ్యంగా వంట నూనె విషయంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని రకాల ఆయిల్స్‌లో ఏకంగా పెట్రోలియం వేస్టేజీని కలుపుతున్నారన్న వార్తలు ఉలిక్కి పడేలా చేస్తోంది. అయితే ఈ తరుణంలో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. సహజంగా పండించిన పంటలను, సహజంగా తయారుచేసిన వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు. ధర ఎక్కువైనా పర్లేదు కానీ ఆరోగ్యం బాగుండాలని ఆశపడుతున్నారు.

దీనిని మన పెట్టుబడి అంశంగా మార్చుకుంటే భారీగా లాభాలు ఆర్జించవచ్చు. వంట నూనెను నేచురల్‌గా తయారు చేసి విక్రయిస్తే లాభాలు ఓ రేంజ్‌లో ఉంటాయి. ప్రస్తుతం చాలావరకు పట్టణాల్లో ఇలా నేచురల్ ఆయిల్ తయారీకి డిమాండ్ పెరుగుతోంది. మరి మీ ఏరియాలో ఈ వ్యాపారం లేకపోతే ప్లాన్ చేయేచ్చు. ఇంతకీ నూనె తయారీకి ఎంత పెట్టుబడి కావాల్సి ఉంటుంది.? లాభాలు ఎలా ఉంటాయి.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

గానుగ నూనెపై ప్రస్తుతం ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. అందుకే గానుగ నూనెకు డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు ఎద్దులతో గానుగ పట్టించేవారు. కానీ ప్రస్తుతం మిషిన్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈ వ్యాపారాన్ని ప్రారంభించాలంటే సుమారు రూ. 3 నుంచి రూ. 4 లక్షల పెట్టుబడి కావాల్సి ఉంటుంది. ఇందుకోసం ఒక చిన్న షటర్ ఉన్నా సరిపోతుంది. వేరుశనగ, నువ్వులను పెద్ద ఎత్తున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గింజలను మిషిన్‌లో వేస్తే సరిపోతుంది, నూనె వస్తుంది. వీటిని బాటిల్స్ లేదా కవర్‌లో ప్యాక్ చేసి విక్రయించుకోవచ్చు.

గానుగనూనె తయారీ మిషిన్ ధర రూ. 2 లక్షల వరకు ఉంటుంది. అలాగే రూమ్‌సెటప్, కావాల్సిన రా మెటీరియల్ కు మొత్తం మరో రూ. 1 నుంచి రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. నూనెను మీ సొంత బ్రాండింగ్‌తో విక్రయించుకోవచ్చు. వినియోగదారులను ఆకర్షించేం దుకు ప్రకటనలు చేసుకోవాలి. లాభాల విషయానికొస్తే ప్రస్తుతం మార్కెట్లో లీటర్ గానుగ నూనె 300 వరకు విక్రయిస్తున్నారు. అలాగే నూనె వచ్చిన తర్వాత మిగిలిన వ్యర్థాన్ని పశువుల దానా కోసం విక్రయించుకోవచ్చు. తక్కువలో తక్కువ నెలకు రూ. 30 వేలకు పైగా ఆర్జించవచ్చు. ■

## ఏపీలో ఒక్కొక్క మహిళకు నెలకు రూ.1500

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్నఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. ఈ పథకానికి అప్పట్లో ఆడబిడ్డనిధి/ మహిళాశక్తిగా పేరు పెట్టింది. ఇప్పుడు ప్రభుత్వం 2024–25బడ్జెట్‌లో 'మహిళలకు ఆర్థిక సహకారం' పేరుతో ఆయా వర్గాలకు చెందిన వారికి రూ. 3,341.82 కోట్లు కేటాయించింది. బీసీ మహిళలకు రూ. 1099.78 కోట్లు, ఎస్సీ మహిళలకు రూ. 1198.42 కోట్లు, గిరిజన మహిళలకు రూ. 330.10 కోట్లు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రూ. 629.37 కోట్లు, మైనారిటీలకు రూ. 83.79 కోట్లు ప్రతిపాదించింది. జెండర్ బడ్జెట్‌లో ఈ నిధుల్ని ప్రత్యేకంగా చూపించింది ప్రభుత్వం. ■

ఇతరుల నిబంధనలను నీవు హేళన చేస్తావు సరే , కానీ నీ నిబంధనలూ అలాంటివేనేమో చూడు

# కోళ్ళ పెంపకంతో ఏడాదికి రూ.15 కోట్ల ఆదాయం

**నేటి** తరంలో చాలామంది తమకు ఇష్టమైన వ్యాపారాలను ప్రారంభించేందుకు ఉద్యోగాలను సైతం మానేస్తున్నారు. అయితే వీరిని అటుగా నడిపిస్తోంది పలువురి విజయగాథలే. వాస్తవానికి పదుల సంవత్సరాల కృషి దాని వెనుక ఉన్నదన్న విషయాన్ని కూడా ఇక్కడ గమనించాలి. ఒకప్పుడు రూపాయి సంపాదన కోసం ఎన్నో కష్టాలు పడిన వ్యక్తులు ప్రస్తుతం లక్షలు, కోట్లు సంపాదిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇప్పుడు మనం మాట్లాడుకోబోతున్నది రవీంద్ర మెట్కర్ సక్సెస్ స్టోరీ గురించే. ఆయన తన 16వ ఏటనే సంపాదన కోసం వేట మొదలెట్టాడు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో జన్మించిన రవీంద్ర కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులతో సతమతమైంది. తండ్రి ప్యూన్‌గా పని చేస్తుండగా, ముగ్గురు తోబుట్టువులతో కుటుంబం ఆర్థికంగా సతమతమైంది. దీంతో రవీంద్ర మెట్కర్ చిన్న వయస్సులోనే పౌల్ట్రీ వ్యాపారం లోకి అడుగుపెట్టాడు. కోళ్ల పెంపకంలో విజయం సాధించిన 55 ఏళ్ల రవీంద్ర ఈ ప్రయాణంలో అనేక ఒడిదొడుకులు, ఎత్తుపల్లాలను చూశారు. కోళ్ల పెంపకంలోకి అడుగుపెట్టక ముందు మందుల షాపులో రోజుకు 5 రూపాయల వేతనానికి పనిచేశాడు.

ఆర్థికంగా కష్టాలు ఉన్నప్పటికీ విద్యను కొనసాగించాడు. కాలేజీకి నడుచుకుంటూనే వెళ్లేవాడు. తనకు తెలిసినవారు పౌల్ట్రీ వ్యాపారంలోకి అడుగుపెట్టి విజయాలను చూడటంతో తానూ ప్రేరణ పొందాడు.

మొదటి పెట్టుబడి కోసం తండ్రి ప్రావిడెంట్ ఫండ్ నుంచి 3000 రూపాయలు తీసుకుని 1984లో కోళ్ల పెంపకం ప్రారంభించాడు. ఆ సమయంలో కేవలం 100 కోళ్లతో చిన్న షెడ్డులో వ్యాపారం ప్రారంభించి తన కృషిని మాత్రం తగ్గించకుండా ముందుకు సాగాడు. 1992లో కామర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేశాడు. దీనితో పాటు కోళ్ల సంఖ్యను 400కి పెంచాడు.

నిరంతరం పరిశ్రమను కొనసాగించిన రవీంద్ర అమరావతిలో ఎకరం పొలం బ్యాంకు రుణంతో కొనుగోలు చేశాడు. అలా 4 వేల కోళ్ల ఫారాన్ని నిర్మించాడు. ఆ సంఖ్యను తర్వాతి కాలంలో 16,000 కోళ్లకు పెంచుకుంటూ పోయాడు. అయితే ఈ క్రమంలో ఇండియాలో కొత్తగా వచ్చిన బర్డ్ ఫ్లూ వల్ల పౌల్ట్రీ వ్యాపారం భారీగా దెబ్బతింది. తన వద్ద ఉన్న 16000 కోళ్లను నష్టానికి అమ్ముకోవాల్సి వచ్చింది.



దీని తర్వాత 2008లో రవీంద్ర 25 లక్షల రూపాయలు అప్పు చేసి ఈసారి 20,000 లేయర్ కోళ్లతో గుడ్ల ఫారమ్ తిరిగి ప్రారంభించాడు. అక్కడి నుంచి వెనుకకు తిరగని రవీంద్ర ప్రస్తుతం 50 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 2 లక్షల వరకు కోళ్లను పెంచుతున్నారు. రోజూ 60,000 రూపాయలు, ఏడాదికి 15 కోట్ల రూపాయల వరకు వ్యాపారం ద్వారా సంపాదిస్తున్నాడు.

అలా తన వ్యాపార చతురతతో నేటితరం యువతకు ఆదర్శవంతమైన వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. వాస్తవానికి ఇది ఆరోజుల్లోనే ఒక అంకుర (స్టార్టప్) పరిశ్రమ అని చెప్పుకోవచ్చు. ■

నీవు కోరుకునే ప్రోత్సాహం నీలోనే వుంది, గుండె సవ్వడి వినిపించుకుంటే నీకే తెలుస్తుంది

# గృహిణులు ఇంటినుంచే చేయగలిగే కొన్ని వ్యాపారాలు!

**చా**లామంది గృహిణులు జీవితంలో ఏదైనా చేయాలనే తపనతో ఉంటారు. కానీ పరిస్థితులు అనుకూలించక సైలెంట్ అయిపోతారు. మీరు బయట పని చేసేందుకు వీలు లేక పోతే... ఇంట్లోనే వ్యాపారం ప్రారంభించొచ్చు. మీ కలలను నెరవేర్చుకోవచ్చు. కుటుంబానికి ఆసరాగా ఉండటంతో పాటుగా మీకుకూడా తృప్తి దొరుకుతుంది. గృహిణులు డబ్బు సంపాదించేందుకు ఉపయోగపడే కొన్నిఆలోచనలు ...

- గిఫ్టింగ్ పరిశ్రమ ప్రస్తుతం ట్రెండింగ్. బట్టలు, నగల నుండి రోజువారీ వస్తువుల వరకు మీరు ప్రతిదీ బహుమతిగా తయారు చేయవచ్చు. మీకు క్రియేటివిటీ ఎక్కువగా ఉంటే... ఈ వ్యాపారం మీకు చాలా లాభాలను తెచ్చిపెడుతుంది. పుట్టినరోజులు, వార్షికోత్స వాలు, స్నేహితుల దినోత్సవం, ప్రేమికుల రోజు మొదలైన వాటికోసం మీరు స్వయంగా తయారుచేసిన బహుమతులను విక్రయించే వ్యాపారాన్ని చేయవచ్చు. గిఫ్ట్ షాప్స్‌తో డీల్ కుదుర్చుకోవాలి.
- ఆరోగ్యం, ఫిట్‌నెస్ ఇప్పుడు కచ్చితంగా సమయం పెడుతున్నారు చాలామంది. ఇందుకోసం డబ్బును కూడా ఖర్చు చేస్తున్నారు. మీకు యోగా తెలిసి ఉంటే.. యోగా ట్రైనర్లకు కూడా చాలా డిమాండ్ ఉంది. మీరు గృహిణిగా ప్రారంభించగల అత్యధిక వేతనం పొందే ఉద్యోగాలలో ఇది ఒకటి. మీకు యోగా గురించి లోతైన జ్ఞానం ఉంటే మీరు శిక్షణ ఇవ్వవచ్చు.
- ప్రస్తుతం యూట్యూబ్ ఛానెల్స్ చాలా ఫేమస్. యూ ట్యూబ్ పవర్ ఏంటో అందరికీ తెలిసిందే. ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ కొంత సమయం వెచ్చిస్తే ఆదాయాన్ని సంపాదించడంలో మీకు ఉపయోగపడు తుంది. మీరు వీడియో ఎడిటింగ్, థంబ్‌నైల్ చేయడం నేర్చుకోవాలి. మంచి కుక్, మేకప్ ఆర్టిస్ట్ అయితే తక్కువ పెట్టుబడితో ఈ యూట్యూబ్ ఛానెల్‌ని ప్రారంభించ వచ్చు. వీడియోలను అప్‌లోడ్ చేస్తూ ఉండాలి. అయితే ఇన్‌కమ్ వచ్చేందుకు కాస్త టైమ్ పడుతుంది.
- రుచికరమైన ఇంట్లో వండిన ఆహారానికి డిమాండ్ ఎక్కువ. కేకులు, కుకీలు, లడ్డూలు ఎలా తయారు చేయాలో మీకు బాగా తెలిస్తే ఇంటి వద్దే హోమ్ బేకరీని ప్రారంభించొచ్చు. దాని ద్వారా డబ్బు సంపా దించవచ్చు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మీ బేకరీని ప్రమోట్ చేసుకోవాలి. వ్యాపారం పెరుగుతున్న కొద్దీ, స్విగ్గీ జోమాటోలో ఎంటర్ కావొచ్చు.
- జామ్‌లు, జిలేబీలు, చాక్లెట్‌ల నుంచి లడ్డూలు, పచ్చళ్లను తయారుచేయడం మీకు వస్తే మంచి వ్యాపారం అవుతుంది. మీరు చిన్నగా ప్రారంభించవచ్చు. ఉత్పత్తులకు డిమాండ్ పెరిగే కొద్దీ వ్యాపారాన్ని క్రమంగా విస్తరించుకోవచ్చు. మీకు తెలిసిన అత్యంత ప్రజాదరణ పొందిన బ్రాండ్లు కూడా చిన్న వంటగది నుండి మొదలయ్యాయని గుర్తుంచుకోండి.
- మీరు ఫ్యాషన్, స్టైలింగ్‌ను ఇష్టపడితే బోటిక్ ప్రారంభిం చండి. ఇది మీకు సరైన వ్యాపారానికి అడుగులు వేసేలా చేస్తుంది. భారతీయ ఫ్యాషన్ పరిశ్రమ ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ బోటిక్‌ని ఆన్‌లైన్‌లో తెరవవచ్చు. ఆన్‌లైన్‌లో ఆర్డర్‌లను పొందవచ్చు. ఇంటినుంచే కొరియర్ కూడా చేయవచ్చు.
- పిల్లలను ట్యూషన్‌కి పంపడం అనేది ఈ రోజుల్లో ఎక్కువైపోయింది. ఇంటి నుండే ట్యూషన్లు చెబితే బాగా సంపాదించుకోవచ్చు. తల్లిదండ్రులు ఎల్లప్పుడూ తమ పిల్లలకు నమ్మకమైన ఉపాధ్యాయుని కోసం చూస్తారు. ఇరుగుపొరుగువారికి మీరు బాగా చదువు చెప్తారనిపిస్తే.. ట్యూషన్ పంపుతారు.
- ఫ్రీలాన్సర్‌గా మారడం కూడా మంచి ఆదాయాన్ని ఇస్తుంది. ఇంటినుండి ఏదైనా మీడియా, బ్లాగులు, సంస్థలకు కంటెంట్‌ను అందించవచ్చు, కథనాలను అందించ వచ్చు. దీనికోసం మీకు రైటింగ్ నాలెడ్జ్, వీడియో ఎడిటింగ్ పరిజ్ఞానం ఉండాలి. ■

ప్రతి రోజూ తెల్లవారేసరికి రెండు మార్గాలు; ఇంకా నిద్రిస్తూ కలలు కనడమా? లేచి ఆ కలల సంగతి తేల్చడమా?

# చిరుధాన్యాలతోనే ఆహార భద్రత ... ఐరాస

**ఆ**కలి, పోషకాహార లోపం, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య ప్రభావం, ఆహారభద్రత సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు.. చిరుధాన్యాల సాగు, వినియోగం పెద్ద ఎత్తున విస్తరించాలని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) సూచించింది.

ఈ మేరకు సాగు మరింతగా అభివృద్ధి చెందాలని, విస్తృత పరిశోధనలు, ఆవిష్కరణలు జరగాలని, కొత్త వంగడాలకు రూపకల్పన చేయాలని పేర్కొంది. ఉత్పత్తుల మార్కెటింగ్ మరింత విస్తృతం కావాలని సూచించింది.

అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023 ప్రాముఖ్యంపై తాజాగా ఎఫ్ఏవో నివేదికను విడుదల చేసింది. వివిధ దేశాల్లో చిరుధాన్యాల సాగు, వినియోగం తదితర అంశాలపై చేపట్టిన అధ్యయనం.. నిపుణులు, శాస్త్రవేత్తలు, వివిధవర్గాల ప్రజల అభిప్రాయాల సేకరణ.. అనంతరం నివేదికను రూపొందించింది.

నివేదికలో చిరుధాన్యాల సాగు, వినియోగం విస్తృతికి పలు సిఫార్సులు చేసింది. ముఖ్యాంశాలివీ..

- బాల్యం నుంచే పిల్లలకు చిరుధాన్యాల ఆహారం అందించాలి. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో చిరుధాన్యాల ఆధారిత వంటకాలను ప్రవేశపెట్టాలి. బియ్యం, గోధుమలు, మొక్కజొన్న ఇతర ఉత్పత్తులకు బలమైన ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు మారాలి.
- జన్యువైవిధ్యంతో పాటు సాంకేతికతను మెరుగుపరిచి విజ్ఞాన మార్పిడి జరగాలి. స్థానిక ప్రభుత్వాలు, రైతులు, మహిళలు, వివిధ సంఘాలను భాగస్వాములను చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- జాతీయ, అంతర్జాతీయంగా ప్రజల ఆహార అవసరాలకు అనుగుణంగా చిరుధాన్యాల సాగు జరగాలి. విత్తన సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయాలి. రైతులు తమకు అనుకూలమైన రకాలను ఎంచుకోవాలి. స్థిరమైన ఉత్పత్తికి సమీకృత పంటల విధానం అనుసరణీయం.
- చిరుధాన్యాలు ఆరోగ్యపరంగా అత్యుత్తమ ఫలితాలను ఇస్తాయి. సంప్రదాయ ఆహారంతో పోలిస్తే వైవిధ్య, స్థితిస్థాపకంగా ఉండే చిరుధాన్యాలు రైతుల జీవనోపాధిని నిలబెట్టాలి. దీనికోసం స్థిరమైన విత్తన పరిరక్షణను బలోపేతం చేయాలి.
- చిన్న కమతాల రైతులు ఈ పంటల వైపు మొగ్గు చూపుతున్నందున వారికి చేయూతనివ్వాలి.
- నీటి పొదుపు ద్వారా సాగు సజావుగా సాగే ప్రణాళిక ఉండాలి.
- నేరుగా వంగడాలను రూపొందించడంతో పాటు కలుపు తీయడం, కోత, నిల్వ, ఉత్పత్తుల శుద్ధి శిక్షణకు సులభతర అవకాశాలను కల్పించాలి.

**మరింతగా మార్కెటింగ్..**

- స్థిరమైన ఉత్పత్తి, యాంత్రీకరణతో పాటు రైతులకు పంటలు లాభదాయకంగా మారేలా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి.
- చిరుధాన్యాల కోసం ప్రత్యేకంగా రైతు బజార్లను ఏర్పాటు చేయాలి. పంట శుద్ధి అనంతరం పిండి, రవ్వ, ఇతర పదార్థాలుగా మార్చి ప్యాకేజింగ్ ద్వారా పంపిణీ జరగాలి. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వారాంతపు సంతల్లోను.. సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల్లోనూ విక్రయాలు సాగాలి.
- ఆన్‌లైన్, మొబైల్ యాప్‌లు, ఈ–కామర్స్ వేదికల ద్వారా ఇళ్లకే నేరుగా సరఫరా చేయడం ద్వారా విక్రయాలు సులభతరం చేయాలి.

# లైంగిక వేధింపులపై రాజీపడినా కేసు పోదు

లైంగిక వేధింపుల కేసులో రాజీ కుదిరిందనే కారణంతో కేసు కొట్టేయడం సబబు కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈమేరకు లైంగిక వేధింపుల కేసులో ఓ టీచర్ పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ రాజస్థాన్ హైకోర్టు వెలువరించిన తీర్పును పక్కన పెట్టింది. సదరు టీచర్‌ను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది.

**కేసు ఏంటంటే..**

2022లో రాజస్థాన్‌లోని గంగాపూర్ సిటీలో ఓ దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విమల్ కుమార్ గుప్తా అనే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో విమల్ కుమార్ గుప్తాపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాల మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. కేసు విచారణ జరుగుతుండగా విమల్ కుమార్ గుప్తా బాధిత కుటుంబంతో రాజీ కుదుర్చుకున్నాడు.

అపోహతో, మిస్ అండర్ స్టాండింగ్ వల్ల తాము కేసు పెట్టామని, టీచర్ గుప్తాపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని తాము కోరుకోవడంలేదంటూ బాలిక తల్లిదండ్రులతో ఓ స్టాంప్ పేపర్ రాయించుకున్నాడు. ఈ పేపర్‌ను పోలీసులకు సమర్పించగా, వారు కోర్టులో ఫైల్ చేశారు. అయితే, కోర్టు ఈ స్టాంప్ పేపర్‌ను ఆమోదించలేదు.

దీంతో గుప్తా రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించాడు. కేసు విచారించిన హైకోర్టు స్టాంప్ పేపర్‌ను పరిశీలించి, బాలిక తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకున్నాక కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ పోలీసులను ఆదేశించింది.

**సుప్రీంకోర్టులో సోషల్ వర్కర్ పిటిషన్**

రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై సోషల్ వర్కర్ రాంజీ లాల్ భైర్వా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుప్తాపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడాన్ని సవాల్ చేశారు.

ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం లైంగిక వేధింపుల కేసులో రాజీకి అవకాశం లేదని పేర్కొంది. పైగా ఈ కేసులో పోక్సో చట్టం, అత్యాచార చట్టం కూడా వర్తిస్తున్నాయని గుర్తు చేసింది.

టీచర్ విమల్‌కుమార్ గుప్తాపై ఎఫ్ఐఆర్ పునరుద్ధరించి, ఆయనను ప్రాసిక్యూట్ చేయాలని పోలీసులను ఆదేశించింది. ■

---

- చిరుధాన్యాల ఉత్పత్తి ప్రదర్శనలు నిర్వహించాలి. యాంత్రీకరణ, ఆహారశుద్ధి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు గ్రాంట్లను ఇవ్వాలి.

**ఉత్పత్తిలో భారత్ మేటి**

చిరుధాన్యాల అతిపెద్ద ఉత్పత్తిదారు భారత్. దేశంలో ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకొని చిరుధాన్యాలు సాగవుతాయి. తరి, ఖుష్కి భూముల్లోనూ పెరుగుతాయి. చీడపీడలను సమర్థంగా ఎదుర్కొంటాయి. నీటి వినియోగం తక్కువ. వీటి సాగువల్ల నేల సాంద్రత పెరుగుతుంది.

పోషకాల పరంగా చిరుధాన్యాలతో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మినరల్స్, ప్రోటీన్లు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు సమకూరుతాయి. పూర్వకాలం నుంచి చిరుధాన్యాల సాగు, వినియోగం జరుగుతోంది.

ప్రధానంగా రాగులు, జొన్నలు, సజ్జలు విస్తృత ప్రాచుర్యంలో ఉన్నాయి. ప్రపంచంలోని మొత్తం ఉత్పత్తిలో దక్షిణాసియా, సబ్‌సహారా ప్రాంతాల్లో 85 శాతం కంటే ఎక్కువ వినియోగమవుతున్నాయి. భారత్, నైజీరియా, నైగర్, చైనా, మాలి చిరుధాన్యాల ఉత్పత్తిలో తొలి 5 స్థానాల్లో ఉన్నాయి. ■

నీవు వెలిగిపోతుంటే అందరూ నీ వెంట నడిచేవారే, నీ చీకటి రోజులలో ఆఖరుకు నీ నీడకూడా నీ వెంట రాదు

# ఒకే మామిడి చెట్టుకు 15 రకాల పండ్లు !

వేసవి కాలంలో పండ్లు అనగానే గుర్తొచ్చేది మామిడి పండు. ఆ సీజన్లో మార్కెట్లో మామిడి పండ్లకు డిమాండ్ భారీగానే ఉంటుంది. మార్కెట్లోనే కాకుండా నచ్చిన మామిడి పండ్లను ఇప్పుడు ఇంట్లోనూ పండించుకుని తినొచ్చు. పండ్లే కాకుండా ఇష్టమైన రకరకాల పూలను సైతం పెరట్లోనే పెంచి కోసుకోవచ్చు. దీనికోసం వందల చెట్లు, పూలమొక్కలు



అవసరం లేదండోయ్. కేవలం ఒకే ఒక్క మొక్క ఉంటే చాలు. అవునండీ, మీరు చదివింది నిజమే. ఒక్క మామిడి చెట్టు నుంచి వివిధ రకాల పండ్లను పొందొచ్చు. అలాగే ఒకే మందారం చెట్టుకు వివిధ రకాల పూలనూ పెంచుకోవచ్చు. అదెలా అంటారా? ఇప్పుడు తెలుసుకుందాం రండి.

ఒకే చెట్టు నుంచి వందల పండ్లు, ఒకే పూల మొక్క నుంచి వివిధ రకాల పూలు పెంచేలా అరుదైన ప్రయోగానికి ఆంధ్రప్రదేశ్లోని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏకు చెందిన తురాయిపు వలస ఉద్యాన క్షేత్రం అధికారులు శ్రీకారం చుట్టారు. మిక్స్డ్ పేరుతో అంట్లు కట్టే విధానాన్ని వీరు ప్రారంభించారు. కొన్ని రోజులుగా ప్రయోగాత్మకంగా వీటి తయారీకి చర్యలు చేపట్టారు. ఒకే చెట్టు నుంచే 15 నుంచి 20 రకాల మామిడి కాయలు, ఒకే మందార మొక్క నుంచే దాదాపు 20 రకాల పూలు పూసేలా సిద్ధం చేస్తున్నారు. అవసరం మేర పండ్ల మొక్కలను, పూల మొక్కలను నాటుకోవచ్చు. ఎక్కువ స్థలం లేకపోతే పెద్ద కుండీల్లోనూ ఎంచక్కా పెంచుకోవచ్చు.

**బత్తాయి, నిమ్మపైనా ప్రయోగాలు :** మూడు నెలల్లోనే అంటు కట్టిన మందారం మొక్క నుంచి నచ్చిన పూలు వస్తాయి. మామిడికి సంబంధించి రెండేళ్ల పాటు పూతను తొలగించి, మూడో ఏడాది నుంచి కాపునకు వదిలేయాలని ఉద్యానశాఖ అధికారి కె.కాంతారావు వివరించారు. ప్రస్తుతం రెండేసి వేల చొప్పున తయారు చేస్తున్నామని, మరో రెండు నెలల్లో మందార మొక్కలను కూడా సరఫరా చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో బత్తాయి, నిమ్మపై కూడా ప్రయోగాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సాధారణంగా రెండు మూడు రకాలతో అంట్లు నాటుతారని, కానీ తాము ఏకంగా 20 రకాలతో మొక్కలను తయారు చేస్తున్నామని వివరించారు. ఈ విధానంతో నచ్చిన పండ్లు, పూలు ఇళ్ల వద్దే అందుబాటులో ఉంటాయని వివరించారు.

(ఈ టీవీ సౌజన్యంతో)

## మామిడి కొమ్మకు ఒకేచోట 55 కాయలు!

సాధారణంగా మామిడి చెట్టుకొమ్మకు ఒకే చోట నాలుగో లేదా అయిదు కాయలు కాయడం చూస్తుంటాం. కానీ ఒకే కొమ్మకు 55 మామిడికాయలు కాయడం మీరెప్పుడైనా చూశారా? సూర్యపేట జిల్లాకు చెందిన ఓ రైతు పొలంలో ఈ అరుదైన దృశ్యం చోటు చేసుకుంది



నారాయణపేట జిల్లా గరిడేపల్లికి చెందిన వోదాల గంగయ్యకు పొలంలో ఓ మామిడిచెట్టు ఉంది. అయితే ఆ చెట్టు కొమ్మలు విరిగి పోయాయి. ఓ కొమ్మ మాత్రం మళ్లీ చిగురించింది. ఆ చిగురే కాయల రూపంలో ప్రతి ఫలించి ఏకంగా 55 మామిడి కాయలను కాసింది. చెట్టుకు నీరు పెట్టడం వల్ల ఎండిన కొమ్మ మళ్లీ చిగురించిందని రైతు చెప్పారు. చెట్టు మొత్తం మీద ఈ ఒక్క కొమ్మకే కాయలు కాసినట్లుగా వెల్లడించారు.

■


# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరుపు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు


భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు





## జీవనోపాధులపై....



పెరిగే వలసలు



రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు



ఆహార
భద్రతకు ముప్పు



పోషకాహార
లోపాలు



తగ్గే ఉపాధి
అవకాశాలు



పంట నష్టాలతో
పెరిగే అప్పులు

NABARD

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26

# స్వయంసహాయ సమాఖ్యలకు పురస్కారోత్సవం ... సదస్సులు, చర్చాగోష్ఠులు
















స్వయంసహాయ సమాఖ్యలకు పురస్కారోత్సవంలో పాల్గొన్న ఏపిమాస్ కుటుంబ సభ్యులు

To ADDRESS









సదస్సులలో ప్రసంగించిన మరి కొందరు

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089